JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । శుక్రవారం 15-05-2026
Medchal - Malkajgiri । Friday 15-05-2026
Follow: jayabherinews
సంపుటి : 02 । సంచిక : 348
పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 348 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889 call me
jayabheripaper@gmail.com



## ప్రధాని మోదీ ఐదు దేశాల పర్యటనపైనే అందరి దృష్టి

- హరిత ఇంధనం నుండి సెమీకండక్టర్ల వరకు
- ఐదు దేశాల పర్యటనకు ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్స్ పూర్తి మద్దతు



జయభేరి, న్యూఢిల్లీ :

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మే 15 నుండి 20 వరకు చేపట్టనున్న ఐదు దేశాల పర్యటనకు ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్స్ పూర్తి మద్దతు ప్రకటించింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అనిశ్చితి నెలకొన్న ప్రస్తుత తరుణంలో, ఈ పర్యటన భారతీయ ఎగుమతులకు ఒక వ్యూహాత్మక మలుపు కానుందని FIEO అధ్యక్షుడు ఎస్.సి. రల్హాన్ అభివర్ణించారు. మే 15 న ప్రారంభమయ్యే ఈ పర్యటన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), నెదర్లాండ్స్, స్వీడన్, నార్వే, ఇటలీ

...మిగతాది 2 లో



## స్వయంగా ఇంధన పొదుపుకు శ్రీకారం

- పొదుపు దిశగా తెలంగాణ అడుగులు
- సీఎం కాన్వాయ్ తగ్గింపు
- ఐటీ ఉద్యోగులకు 'వర్క్ ఫ్రమ్ హోమ్'?

జయభేరి, హైదరాబాద్ :

దేశంలో ఇంధన వినియోగాన్ని తగ్గించాలంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపునకు కార్పొరేట్ సంస్థలతో పాటు ప్రభుత్వాల నుంచి ఊహించని స్థాయిలో మద్దతు లభిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు అందరి దృష్టి ఐటీ హబ్ అయిన హైదరాబాద్‌పై పడింది. నగరంలో లక్షలాది మంది ఐటీ ఉద్యోగులు ప్రతిరోజూ ప్రజా, వ్యక్తిగత వాహనాల్లో ప్రయాణిస్తుంటారు. తెలంగాణలో 'వర్క్ ఫ్రమ్ హోమ్' (WFH) విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తే.. ఇంధన వినియోగం, కాలుష్యం గణనీయంగా తగ్గుతాయని నిపుణులు భావిస్తున్నారు. ఇప్పటికే షాదీ.కామ్, ఆర్‌పిజి గ్రూప్, పిడబ్ల్యూసి వంటి ప్రముఖ కార్పొరేట్ కంపెనీలు డబ్ల్యూఎఫ్‌హెచ్‌కు మారుతున్నట్లు ప్రకటించాయి. అటు ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు కూడా ఇదే దిశగా అడుగులు వేస్తుండగా.. తెలంగాణ ప్రభుత్వం సైతం ఐటీ రంగానికి వర్క్ ఫ్రం హోమ్ అమలు చేసే దిశగా కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. మరోవైపు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఇంధన పొదుపు చర్యలకు శ్రీకారం చుట్టారు. సీఎం కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను తగ్గించే అంశంపై అధికారులు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. సాధారణంగా సుదూర ప్రయాణాలకు మినహా, నగర పరిసర ప్రాంతాల్లో తిరిగేటప్పుడు సీఎం కాన్వాయ్‌ను కేవలం రెండు లేదా మూడు వాహనాలకే పరిమితం చేయాలని భావిస్తున్నారు. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి మూడు వాహనాల్లోనే ప్రయాణిస్తుండగా, దీనిపై త్వరలోనే సీఎంవో (CMO) అధికారిక నిర్ణయాన్ని ప్రకటించనుంది. ప్రభుత్వ పెద్దలే ఆదర్శంగా నిలుస్తూ తీసుకుంటున్న ఈ నిర్ణయాలు రాష్ట్రంలో ఇంధన సంక్షోభ నివారణకు ఎంతగానో దోహదపడనున్నాయి.

## బండి భగీరథ్ పోక్సో కేసులో వీడని ఉత్కంఠ

- ముందస్తు బెయిల్ పిటిషన్ వాయిదా వేసిన హైకోర్టు
- మధ్యంతర బెయిల్‌పై రేపు విచారణ జరుపుతామని వెల్లడి



జయభేరి, హైదరాబాద్ :

బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. తనపై నమోదైన పోక్సో కేసును కొట్టేయాలని.. ఈ కేసులో అరెస్ట్ కాకుండా ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని బండి భగీరథ్ పెట్టుకున్న పిటిషన్‌ను కోర్టు వారం రోజులు వాయిదా వేసింది. అయితే మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై మాత్రం రేపు విచారణ జరుపుతామని తెలిపింది. ఈ విచారణలో ప్రధానంగా బాధితురాలి వయసుపైనా ఎక్కువ వాదనలు జరగడం గమనార్హం. ఆమె మైనరా కాదా అనేది ఇప్పుడు తీవ్ర చర్చకు దారి తీసింది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పోక్సో కేసు రాష్ట్రంలో గత వారం రోజులుగా తీవ్ర సంచలనం రేపుతుండగా.. ఇవాళ ఈ వ్యవహారం తెలంగాణ హైకోర్టులో విచారణకు వచ్చింది. అయితే ఈ పోక్సో కేసులో బండి భగీరథ్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణను వారం రోజులు వాయిదా వేస్తూ.. ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. కానీ శుక్రవారం రోజున మధ్యంతర బెయిల్‌కు సంబంధించిన విచారణను చేపట్టనున్నట్లు తెలిపింది. బండి భగీరథ్ తరఫున లాయర్ నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించగా.. పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగేశ్వర రావు హాజరయ్యారు. ఈ కేసు వాదనల సందర్భంగా.. అసలు ఈ పోక్సో కేసు పెట్టిన బాధితురాలు మైనర్ బాలికనా కాదా అనేది ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. బండి భగీరథ్ తరఫున వాదనలు వినిపించిన లాయర్ నిరంజన్ రెడ్డి.. అసలు ఆమె మెనర్ కాని.. ఆమె వయసు 19 ఏళ్ల నుంచి 20 ఏళ్లు

...మిగతాది 2 లో

## ఉద్యోగులకు డీఏ పెంపు

- విజయ్‌తో అట్లుంటది మరి
- 4 రోజుల్లోనే సంచలన నిర్ణయాలు




జయభేరి, చెన్నై :

తమిళనాడులో నూతన ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ పరిపాలనలో తనదైన వేగాన్ని ప్రదర్శిస్తున్నారు. బాధ్యతలు చేపట్టిన తొలి నాలుగు రోజుల్లోనే ప్రజల సంక్షేమం, భద్రత, సామాజిక సంస్కరణల దిశగా ఏడు సంచలన నిర్ణయాలు తీసుకుని రాజకీయ వర్గాల్లో చర్చకు తెరలేపారు. ఎన్నికల హామీలను యుద్ధ ప్రాతిపదికన అమలు చేసేందుకు ఆయన శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా తమిళనాడు సర్కార్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగులకు డీఏ రెండు శాతం పెంచుతూ సీఎం విజయ్

...మిగతాది 2 లో

## ఫర్నిచర్ షో రూమ్ లో భారీ అగ్ని ప్రమాదం



జయభేరి, హయత్‌నగర్ :


హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హయత్‌నగర్ ప్రాంతంలో జయశ్రీ ఎలక్ట్రానిక్స్ షాప్, లక్ష్మీనరసింహ కార్ డెకార్స్, ఒక ఫర్నిచర్ దుకాణం, సమీపంలోని మరికొన్ని షాపుల్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా సుమారు 05:20 గంటల సమయంలో అగ్ని ప్రమాదం సంభవించింది. అసిఫ్ నగర్లో ఎం జె క్లాసిక్ ఫర్నిచర్ షోరూంలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. మంటల్లో ఫర్నిచర్ పూర్తిగాకాలి బూడిదైంది. అయితే, అదృష్టవశాత్తూ ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. షోరూం అపార్ట్మెంట్లో ఉండటంతో అప్రమత్తమైన ఫ్లాట్ నివాసులు వెంటనే బయటకు వచ్చి సురక్షితంగా నిలిచారు. సమాచారం అందుకున్న వెంటనే హయత్‌నగర్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో జయశ్రీ ఎలక్ట్రానిక్స్ షాప్, ఫర్నిచర్ షాప్‌కు నష్టం జరిగినది. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. పోలీసులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడం వల్ల మంటలు మరింత వ్యాపించకుండా నియంత్రించగలిగారు.

## కేరళం ముఖ్యమంత్రిగా సతీశన్

2 లో

## సీఎం బాటలో డిప్యూటీ సీఎం

- చంద్రబాబు బాటలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్
- దేశ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి బాబు, డిప్యూటీ సీఎం పవన్
- సోలార్ ద్వారా ప్రతి ఒక్కరూ విద్యుత్ ఉత్పత్తి చేసుకోవాలని పిలుపు



జయభేరి, విజయవాడ, మే 14 :

ప్రధాని నరేంద్రమోదీ ఇంధన పొదుపుపై పిలుపునివ్వడంతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. తన కాన్వాయ్‌లో ఉండే వాహనాల సంఖ్యను 50 శాతం తగ్గించాలని సూచించారు. డీజీపీ, ఇంటెలిజెన్స్ చీఫ్‌కు కీలక సూచనలు చేశారు. అలాగే మంత్రులు, ఇతర వీఐపీలు కూడా కాన్వాయ్‌లో సాధ్యమైనంత తక్కువ వాహనాలను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని చంద్రబాబు సూచించారు. అలాగే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా తన కాన్వాయ్‌లో వాహనాలను తగ్గించాలని సూచించారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు పొదుపు మంత్రం పాటిస్తున్నారు. ఇద్దరు నేతలు తమ కాన్వాయ్‌లో వాహనాల సంఖ్యను తగ్గించాలని సూచించారు. ఇకపై జిల్లాల్లో పర్యటించేటప్పుడు సీఎం, డిప్యూటీ సీఎంలకు సంబంధించిన కాన్వాయ్‌లలోని వాహనాలను సగం తగ్గించాలని అధికారులకు సూచించారు. చంద్రబాబు తన కాన్వాయ్‌లోని వాహనాలను 50శాతం కుదించాలని ఆదేశించారు.

...మిగతాది 2 లో

## ఆస్ట్రేలియా ప్రతినిధులతో భేటీ పట్ల సంతోషం



- కేటీఆర్ తో భారతదేశంలోని ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ భేటీ

జయభేరి, హైదరాబాద్ :

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో భారతదేశంలోని ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఆస్ట్రేలియా కాన్సల్ జనరల్ హిల్లరీ మెక్గీచీతో సమావేశమయ్యారు. నందినగర్ లో జరిగిన ఈ భేటీలో పరస్పర ప్రయోజనాలు, వ్యూహాత్మక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఆస్ట్రేలియా పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, సాంకేతిక రంగంలో పరస్పర సహకారం, విద్యారంగంలో నూతన భాగస్వామ్యాల గురించి ఈ సమావేశంలో ప్రస్తావించారు. గతంలో పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రిగా పనిచేసిన అనుభవమున్న కేటీఆర్ ఈ అంశంలో అనేక అంశాలపై చర్చించారు. ఐటీ, గ్రీన్ ఎనర్జీ, ఫార్మా, ఇన్నోవేషన్ రంగాల్లో హైదరాబాద్ కేంద్రంగా జరుగుతున్న అభివృద్ధిపై... తెలంగాణ, ఆస్ట్రేలియా మధ్య సహకారం భవిష్యత్తులో స్థానిక యువతకు మరిన్ని అంతర్జాతీయ అవకాశాలను కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశాయి. భారత్, ఆస్ట్రేలియా మధ్య ఉన్న దృఢమైన మైత్రిని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే దిశగా ఈ చర్చలు సాగాయి. ఆస్ట్రేలియా ప్రతినిధులతో జరిగిన ఈ భేటీ పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, ఈ భాగస్వామ్యం ఇరు దేశాల ఆర్థిక వ్యవస్థలకు, సాంస్కృతిక బంధాలకు మరింత బలాన్ని చేకూరుస్తుందని పేర్కొన్నారు.

▶▶ మొదటిపేజీ తరువాయి

## బండి భగీరథ్ పోక్సో కేసులో వీడని ఉత్కంఠ

ఉంటుందని పేర్కొన్నారు. ఆమె రకరకాల తేదీలతో వేర్వేరు బర్త్ సర్టిఫికెట్లు తీసుకుందని కోర్టుకు విన్నవించారు. బాధితురాలి తల్లి కావాలనే తప్పుడు రికార్డులు, సర్టిఫికెట్లతో ఆమె వయసును తగ్గించి పోక్సో కేసు పెట్టించారని ఆరోపించారు. మరోవైపు.. పోక్సో కేసులో కూడా పిటిషనర్‌కు కొన్ని హక్కులు ఉంటాయని పేర్కొన్న లాయర్ నిరంజన్ రెడ్డి.. పోక్సో చట్టంలోని సెక్షన్ 11 పరిధిలోకి పిటిషనర్ రారని పేర్కొన్నారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 74, 75 కింద ఆరోపణలు రుజువు కాలేదని వివరించారు. తన క్లైయింట్ బండి భగీరథ్ నుంచి బాలిక ఫ్యామిలీ రూ.5 కోట్లు డిమాండ్ చేసినట్లు లాయర్ తెలిపారు.

అంతేకాకుండా తన క్లైయింట్‌ను బెదిరించడమే కాకుండా.. ఆ డబ్బులు ఇవ్వకపోతే ఆత్మహత్య చేసుకుంటానని బాధితురాలు బెదిరింపులకు దిగిందని వాదించారు. ఇక బాలిక, ఆమె కుటుంబం బెదిరింపులు, వేధింపులు తట్టుకోలేని బండి భగీరథ్.. కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో హనీట్రాప్ కేసు పెట్టినట్లు తెలిపారు. కేంద్రమంత్రి కుమారుడు కావడంతో వారు తన క్లైయింట్‌పై కుట్ర చేశారని పేర్కొన్నారు. అంతేకాకుండా ఒకసారి ఎఫ్ఐఆర్ పెట్టిన తర్వాత సెక్షన్లను మార్చడం చాలా అనుమానాలకు దారి తీస్తోందని వెల్లడించారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తర్వాత.. కావాలనే సెక్షన్లను మార్చారని ఆరోపించారు. ఇది ఒక కుట్రగా భావించాలని కోర్టుకు విన్నవించారు. బాధితురాలి స్టేట్‌మెంట్ రికార్డు చేసిన తర్వాత.. నిజానిజాలు తెలుసుకుని సెక్షన్లను మార్చినట్లు బాధితురాలి తరఫున వాదనలు వినిపిస్తున్న లాయర్ పీపీ నాగేశ్వరరావు కౌంటర్ ఇచ్చారు. రెండు వైపులా వాదనలు విన్న హైకోర్టు వెకేషన్ బెంచ్.. బండి భగీరథ్ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను వారం రోజులకు వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. అంతేకాకుండా బాధితురాలి పుట్టిన తేదీకి సంబంధించి వేర్వేరు సర్టిఫికెట్లు ఉండటం.. గతంలో ఆమె రాష్ డ్రైవింగ్ కేసులో పోలీసులు ఫైల్ చేసిన ఛార్జిషీట్‌లో ఆమె వయసు ఎక్కువగా ఉండటం వంటి వాటిపై విచారణ జరపాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఆమె వయసుపై పోలీసులు ఇచ్చే నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకుంటామని తేల్చి చెప్పింది. అయితే.. ఈ కేసులో ముందస్తు బెయిల్ వచ్చే వరకు పోలీసులు బండి భగీరథ్‌ను అరెస్ట్ చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని అతని తరఫు లాయర్ కోరగా.. ఈ కేసులో మధ్యంతర బెయిల్‌పై శుక్రవారం రోజున విచారణ జరుపుతామని హైకోర్టు తేల్చి చెప్పింది.

## సీఎం బాటలో డిప్యూటీ సీఎం

జిల్లా పర్యటనల్లోనూ వాహనాల సంఖ్యను 50 శాతం తగ్గించాలని డీజీపీ, ఇంటెలిజెన్స్ చీఫ్‌లకు తేల్చి చెప్పారు. మంత్రులు సహా ప్రముఖులందరూ సాధ్యమైనంత వరకు తక్కువ వాహనాలు వినియోగించేలా చూడాలని చంద్రబాబు ఆదేశించారు. వీలైనంత వరకు గతంతో పోలిస్తే సగం వాహనాలే ఉండేలా చూడాలని సూచించారు. ఇటీవల కాలంలో భారీ కాన్వాయ్‌తో ఫ్యాషన్ అయ్యిందని.. భద్రత కూడా అర్థవంతంగా ఉండాలన్నారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ పెట్రోల్, డీజిల్ ఉత్పత్తుల వినియోగాన్ని తగ్గించాలని పిలుపునివ్వగా.. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు అదే బాటలో నడుస్తున్నారు. ఇంధనం మాత్రమే కాదు ఇతర అంశాల్లో తీసుకోవాల్సిన పొదుపు చర్యలపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది.

ఇవాళ జరిగే క్యాబినెట్ భేటీలో పొదుపు చర్యలపై కీలక నిర్ణయం తీసుకోనున్నారు. ప్రతి ఒక్కరూ దేశ ప్రయోజనాల దృష్ట్యా ప్రస్తుత పరిస్థితుల్ని అర్థం చేసుకుని నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరుతున్నారు. పశ్చిమాసియాలో పరిస్థితుల కారణంగా ప్రధాని సూచనల్ని ప్రతి ఒక్కరూ పాటించాలంటున్నారు. ప్రజలు దుబారా ఖర్చులు తగ్గించాలని.. పొదుపు చాలా ముఖ్యమన్నారు. ప్రభుత్వ రంగంలో కూడా వర్క్ ఫ్రం హోమ్ విధానాన్ని అమలు చేస్తామన్నారు. రాబోయే రోజుల్లో మరికొన్ని సంక్షోభాలు వస్తాయని.. వాటిని ఎదుర్కోవాల్సిందే అన్నారు. మనం కూడా అన్నింటికీ విదేశాల మీద ఆధారపడకుండా స్వయం సమృద్ధి సాధించాల్సిన అవసరం ఉందన్నారు చంద్రబాబు. సోలార్ ద్వారా ప్రతి ఒక్కరూ విద్యుత్ ఉత్పత్తి చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆ విద్యుత్‌ను ప్రజలు వారి అవసరాలకు వాడుకుని మిగిలింది అమ్ముకుని ఆదాయం పొందొచ్చన్నారు. ఈ సోలార్ పవర్ కోసం ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలను ఉపయోగించుకోవాలన్నారు. ప్రజలు ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్ని గమనించి పెట్రోల్, డీజిల్ వినియోగం తగ్గించాలని సూచించారు. కచ్చితంగా ప్రజల ఆలోచనా విధానంలో మార్పు రావాలన్నారు చంద్రబాబు. నాదేశం నా బాధ్యత అందరిలో రావాలన్నారు.

## ఉద్యోగులకు డీఏ పెంపు

నిర్ణయం తీసుకున్నారు. 58 నుంచి 60 శాతానికి పెంచుతూ తమిళనాడు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రజలపై ఆర్థిక భారాన్ని తగ్గించే లక్ష్యంతో గృహ వినియోగదారులకు ప్రతి రెండు నెలలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించే ఫైలుపై విజయ్ తొలి సంతకం చేశారు. గత డీఎంకే ప్రభుత్వం 100 యూనిట్లు ఇస్తుండగా, విజయ్ దాన్ని రెట్టింపు చేసి పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఊరటనిచ్చారు. దీనివల్ల ప్రభుత్వంపై ఏటా సుమారు రూ. 1,730 కోట్ల అదనపు భారం పడనుంది. మత్తు పదార్థాల మహమ్మారిని తరిమికొట్టేందుకు 65 ప్రత్యేక విభాగాలతో యాంటీ నార్కోటిక్ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. పాఠశాలలు, కళాశాలల వద్ద డ్రగ్స్ విక్రయాలపై కఠిన నిఘా ఉంచాలని, ముఖ్యమంత్రి కార్యాలయం దీన్ని నేరుగా పర్యవేక్షించాలని ఆదేశించారు. అదేవిధంగా మహిళల రక్షణ కోసం 'సింగ పెణ్' అనే ప్రత్యేక టాస్క్ ఫోర్స్‌ను రంగంలోకి దించారు. మద్యం నియంత్రణపై విజయ్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. విద్యా సంస్థలు, దేవాలయాలకు 500 మీటర్ల పరిధిలో ఉన్న 717 టాస్మాక్ (TASMAC) మద్యం దుకాణాలను వెంటనే మూసివేయాలని ఉత్తర్వులు జారీ చేసింది.

రాష్ట్రంలోని మొత్తం షాపుల్లో ఇది 15 శాతం వరకు ఉండటం గమనార్హం. అంతేకాకుండా మద్యం కొనుగోలు చేసే వారి వయసు ధ్రువీకరణ కోసం ఆధార్ లేదా డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి చేశారు. నిరుద్యోగ యువతకు అండగా నిలుస్తూ టీఎన్పీఎస్సీ, ఎస్ఎస్సీ వంటి పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్ సౌకర్యాన్ని ప్రకటించారు. గ్రామీణ విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నీట్ (NEET) పరీక్షను రద్దు చేయాలని, ప్లస్ టూ మార్కుల ఆధారంగానే వైద్య సీట్లు కేటాయించాలని కేంద్రానికి అధికారికంగా విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలోనే.. ప్రభుత్వ ఉద్యోగులకు డీఏం పెంచుతూ విజయ్ నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయాల ద్వారా విజయ్ ప్రభుత్వం సంక్షేమం, సామాజిక సంస్కరణల కలయికగా పాలనను సాగిస్తోంది.

## రైతులు ఎవరు ఆందోళన చెందవద్దు

● మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి

**జయభేరి, ఖమ్మం :**

రూ. 22 వేల కోట్లతో సుమారు 85 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని ఈ యాసంగిలో కొనుగోలు చేయబోతున్నాం. ఖమ్మం జిల్లా పాలేరులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జిల్లా కలెక్టర్, డిప్యూటీ కలెక్టర్, ఆయా శాఖలకు సంబంధించిన జిల్లా ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులతో కలిసి సందర్శించి అక్కడ నెలకొన్న పరిస్థితులను పరిశీలించారు.

ఈ సందర్భంగా ధాన్యం సేకరణ, మద్దతు ధర, తూకంలో పారదర్శకత, గోనె సంచుల లభ్యత, సేకరించిన ధాన్యం మిల్లులకు తరలింపు అమలుపై మంత్రులు స్వయంగా రైతులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యాన్ని తూకం వేసే టప్పుడు ఎలాంటి చిన్న పొరపాటు జరిగిన కఠిన చర్యలు తప్పవని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని తక్షణమే మిల్లులకు తరలించేలా లారీల సంఖ్యను పెంచి, ఎక్కడా సమస్యలు తలెత్తకుండా వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రులు ఆదేశించారు.

# హైకోర్టు నిర్మాణంలో అవినీతి మరకలు...

**జయభేరి, హైదరాబాద్, మే 14 :**



హైకోర్టు భవనాల నిర్మాణంలో అవినీతి చెదలు కనిపిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తెలంగాణ రాష్ట్ర నూతన హైకోర్టు భవన సముదాయం, న్యాయమూర్తుల నివాసాల సముదాయాల నిర్మాణాన్ని చేపట్టింది. అయితే హైకోర్టు భవన నిర్మాణం పనుల్లో నాణ్యతాలోపం, అంచనాలను భారీగా పెంచేలా.. పలు సాంకేతిక అంశాలను తెరపైకి తీసుకొచ్చారు. ఇందులో భాగంగా హైకోర్టు నిర్మాణం చేపడుతున్న ప్రాంతంలోని మట్టి భారాన్ని మోసే సామర్థ్యం తక్కువగా ఉందని (మెత్తగా ఉందని) రికార్డులను తారుమారు చేసి.. అదనంగా లోతుగా తవ్వాలని, అలాగే అదనంగా కాంక్రీట్ పనులు, పిల్లర్లను వేయాల్సి ఉంటుందనేలా కొత్త పథకాన్ని తెరపైకి తీసుకువచ్చారు. దీంతో సెల్లార్లకు సంబంధించిన వ్యయం సుమారు 280 శాతం పెరిగిందని, మొత్తం ప్రాజెక్టు అంచనా వ్యయంలో సుమారు 200 కోట్ల వరకు పెరిగిందని తెలుస్తోంది. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లో నూతన హైకోర్టు భవనాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. ఇందుకు రాజేంద్రనగర్‌లో ఉన్న వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని ఆనుకుని సుమారు 100 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. నూతన హైకోర్టు నిర్మాణ భవన సముదాయాల నిర్మాణాన్ని చేపట్టేందుకు రూ. 2,583 కోట్ల వ్యయం అంచనాలతో పరిపాలనా అనుమతులను 2024 డిసెంబర్‌లో ఇచ్చారు. ఇందులో ప్రధానమైన కోర్టు భవనం, న్యాయమూర్తుల నివాస సముదాయం, న్యాయవాదులు, కక్షిదారుల కోసం.. ఇలా అన్ని రకాల వసతులతో నిర్మించే భవనానికి రూ. 1,443.73 కోట్లతో (ఈసీవీఎస్టిమేటెడ్ కాంట్రాక్ట్ వాల్యూ) టెండర్లు పిలిచారు. అయితే సుమారు 4.95 శాతం ఎక్కువకు కోట్ చేసిన డీఈసీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ప్రాజెక్ట్స్ (ఇండియా) ప్రై.లి. అనే సంస్థ ఈ టెండర్‌ను రూ. 1,515 కోట్లకు దక్కించుకుంది మరో రూ. 603 కోట్లను హైకోర్టులో కావాల్సిన ఫర్నిచర్, ఇంటీరియర్, ఇతర వస్తుసామాగ్రిని ఏర్పాటు చేయడానికి కేటాయించారు.

మొత్తం 36.52 లక్షల చదరపు అడుగుల మేర నిర్మాణ పనులను చేపట్టారు. జోన్1లో అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లు 3, అడ్వొకేట్స్ బ్లాక్‌లు 3, పబ్లిక్ వసతులు, సౌకర్యాల బ్లాక్, పబ్లిక పార్కింగ్, అడ్వొకేట్ పార్కింగ్, బార్ కౌన్సిల్‌ను నిర్మించనున్నారు. అలాగే ప్రధాన కోర్టు భవనంలో మొత్తం 51 కోర్ట్ హాళ్లు ఉంటాయి. వీటి మొత్తం విస్తీర్ణం 6.52 లక్షల చదరపు అడుగులు. ఇక జోన్2లో హైకోర్టు చీఫ్ జస్టిస్ నివాసం, సచివాలయం, అలాగే మరో 41 న్యాయమూర్తుల బంగాళాలు, క్లబ్‌హౌజ్, ఆడిటోరియం, సెంట్రల్ రికార్డ్ రూం తదితర నిర్మాణాలు ఉండనున్నాయి. వీటికి అదనంగా జడ్జీల పార్కింగ్‌లను కూడా ఏర్పాటుచేస్తారు. వాస్తవానికి మట్టి బరువుమోసే సామర్థ్యాన్ని తగ్గించి చూపడంతో.. అదనపు పనులు చేపట్టే అవకాశం చిక్కింది. దీనివల్ల అదనంగా లాభం కలుగుతుంది. అలాగే.. చేసే పనుల్లోనూ నాణ్యత లేకుండా, సాంకేతిక అంశాలకు, డ్రాయింగ్ లకు విరుద్ధంగా పనులు చేస్తుండటంతో.. భవిష్యత్తులో ప్రమాదాలను ఎదుర్కొవాలి ఉంటుందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కాంట్రాక్టరు కేవలం తమకు లాభం కలగాలనే ఉద్దేశంతో పునాది, బేస్ నిర్మాణంలో వాడాల్సినంత స్టీల్‌ను వాడటంలేదని తెలుస్తుంది. స్టీల్ సపోర్ట్ లేకుండానే.. రీఎన్‌ఫోర్స్‌డ్ సిమెంట్ కాంక్రీట్ (ఆర్‌సీసీ) పనులు చేస్తున్నట్టుగా తెలుస్తుంది. అలాగే పద్ధతి లేకుండా బేస్ కాంక్రీట్ పనులు చేస్తున్నట్టుగా నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న కన్సల్టెంట్ సంస్థకూడా గుర్తించింది. డ్రాయింగ్‌ల ప్రకారం కాకుండా.. ఇష్టారాజ్యంగా స్టీల్‌ను వాడుతున్నారు. షట్లర్ ప్లేట్లు సరైనవి వాడకపోవడం వల్ల కాంక్రీట్ వేసిన తరువాత ఉబ్బిపోయి పగుళ్లు ఏర్పడుతున్నాయి. ఇలా కాంట్రాక్టరు తన ఇష్టారాజ్యంగా నిర్మాణం పనులు చేపడుతున్నట్టుగా అధికారులు కూడా గుర్తించినట్టు సమాచారం. రాష్ట్ర హైకోర్టు నూతన భవన సముదాయం నిర్మాణానికి సంబంధించి టీం వన్ ఇండియా ప్రై.లి. అనే ఇంజనీరింగు సంస్థను కన్సల్టెంట్‌గా నియమించుకున్నారు. ఈ కన్సల్టెంట్ సంస్థ.. హైకోర్టు నిర్మాణాలకు సంబంధించి సాంకేతిక అంశాలను పరిశీలిస్తుంది. అలాగే 'డ్రాయింగ్‌లు, డిజైన్లను రూపొం దించి, వాటికి అనుమతి తీసుకుని వాటి ప్రకారం నిర్మాణ పనులను చేపట్టేలా చూస్తుంది. అయితే ప్రస్తుతం చేపడుతున్న నిర్మాణ పనులను పర్యవేక్షించడానికి సదరు టీం వన్ ఇండి యా ప్రై.లి. సంస్థ ప్రతినిధులతో.. కాంట్రాక్టు సంస్థ సరిగా వ్యవహరించడం లేదని, సహకరించడం లేదని పేర్కొంటూ.. దీనితో పాటు.. పలు సాంకేతిక అంశాలను పేర్కొంటూ.. 2025 డిసెంబర్ 17న సదరు కన్సల్టెంట్ సంస్థ హైకోర్టు బిల్డింగ్ కమిటీకి ఏకంగా లేఖ రాసింది.

ఇందులోనే.. మట్టి బరువుమోసే సామర్థ్యం (సాయిల్ బియరింగ్ కెపాసిటీ) విషయంలో.. చుట్టుపక్కల 115 టన్నులు/స్కేర్‌మీటర్ ఉండగా.. హైకోర్టు నిర్మాణ స్థలంలో కేవలం 40 నుంచి 70 టన్నులు/స్కేర్ మీటర్‌గా పేర్కొనడాన్ని ఎత్తి చూపింది. దీనివల్ల అదనంగా రాష్ట్ర ప్రభుత్వంపై వ్యయ భారం పెరుగుతుందని, ఇది సరైందికాదంటూ తేల్చిచెప్పింది. సాయిల్ బియరింగ్ కెపాసిటీని సరిగ్గా నిర్ధారించడానికి ప్లేట్ లోడ్ టెస్ట్ నిర్వహించాలనికూడా కన్సల్టెంట్ సంస్థ రాసిన లేఖలో స్పష్టంగా సూచించింది. నిర్మాణ ప్రాంతంలో 160 మంది సాంకేతిక సిబ్బందిని వినియోగిస్తున్నామని కాంట్రాక్ట్ సంస్థ చెబుతున్నప్పటికీ.. కేవలం 20 నుంచి 30 మంది మాత్రమే ఉన్నారని, అలాగే నిర్మాణంలో 700 మంది కార్మికులు పనులు చేస్తున్నట్టుగా చెబుతున్నప్పటికీ.. కేవలం 150 నుంచి 200 మంది మాత్రమే పనులు చేస్తున్నారని.. దీని ప్రభావం పనుల నాణ్యతపై తప్పకుండా ఉంటుందని కన్సల్టెంట్ సంస్థ పేర్కొంది. హైకోర్టు నిర్మాణ పనులకు నియమించిన కన్సల్టెంట్ సంస్థ టీం వన్ ఇండియా ప్రై. లి. సంస్థ 2025 డిసెంబర్ 17న హైకోర్టు బిల్డింగ్ కమిటీకి రాసిన లేఖలో సుమారు 10 అంశాలను చర్చించారు. ఇందులో ప్రధాన మైనది మట్టి బరువు మోసే సామర్థ్యం (సాయిల్ బియరింగ్ కెపాసిటీ కాగా.. స్ట్రక్చరల్ డిజైన్‌లో తేడాలున్నాయని, అలాగే భవిష్యత్తులో హైకోర్టు భవనం ఎత్తు పెంచాల్సిన అవసరం లేదని స్పష్టంగా ఉన్నప్పటికీ.. ఈ నిబంధనను పక్కనపెట్టి.. భవిష్యత్తు అవసరాలమేరకు అంటూ అదనంగా మరోరెండు ఫ్లోర్ల నిర్మా ణం అనే అంశాన్ని పక్కనపెట్టినట్టుగా లేఖలో స్పష్టంగా పేర్కొన్నారు.

అలాగే సరైన సమయంలోనే అన్ని రకాల డ్రాయింగ్‌లను సమర్పించినట్టు, ఇందు లో గరష్టంగా ఐఐటీ స్థాయిలో పరిశీలిం చి అంగీకరించారని తెలిపారు. హైకోర్టు భవన సముదా యం చుట్టూ సుమారు 3.4 కి.మీ పొడవునా.. చూట్టూ ప్రహరీ గోడ ని ర్మించాల్సి ఉందని పేర్కొన్నా రు. అలాగే.. సుమారు 100 ఎకరాల స్థలాన్ని చదునుచేసే విషయంలో మినిమం కట్ అండ్ ఫిల్ అనే పద్ధతిలో చేస్తే ఎర్త్ వర్క్ శ్రమ తగ్గుతుందని, తద్వారా వ్యయాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారుదీనితోపాటు.. బిల్డింగ్ ఎంట్రన్స్‌లు, ఎగ్జిట్‌దారులు వర దనీరు, డ్రెయిన్ల నిర్వహణ, ఫైర్‌సేఫ్టీ, పార్కింగ్ స్థలాలు (2,800 వాహనాలు పార్కింగ్ చేసే అవకాశం), స్టాఫ్ క్వార్టర్ల నిర్మాణంపై వారి డ్రాయింగ్‌లను, డిజైన్లను స్పష్టంగా పేర్కొంటూ.. తమ డ్రాయింగ్‌లు, డిజైన్లు, చేసిన సవరణలకు సంబంధించినవాటిని పరిశీలించి బిల్డింగ్ కమిటీ అనుమతి ఇవ్వాలని కన్సల్టెంట్ రాసిన లేఖలో స్పష్టంగా పేర్కొన్నారు. అదనంగా వ్యయం కాకుండా చూడాలని కూడా అందులో తెలపడం గమనార్హం. హైకోర్టు నిర్మాణంలో మొదటిదైన.. పునాదిలోనే అవినీతికి రాయిపడిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవానికి రూ. 1,515 కోట్లకు కాంట్రాక్టు కుదిరినప్పటికీ.. దీనిని వివిధ సాంకేతిక కారణాలను చూపెట్టి.. అదనంగా సుమారు రూ. 200 కోట్ల వరకు అంచనాలను పెంచినట్టుగా వినపడుతోంది. ఇందుకు ప్రధాన కారణంగా.. బరువుమోసే మట్టి సామర్థ్యాన్ని తక్కువగా చూపించినట్టు తెలుస్తుంది. వాస్తవానికి హైకోర్టు నిర్మాణం జరుగుతున్న ప్రదేశాలకు చుట్టుపక్కల మట్టికి బరువుమోసే సామర్థ్యం (సాయిల్ బియరింగ్ కెపాసిటీ 115 టన్నులు/ స్కేర్ మీటర్ ఉండగా.. హైకోర్టు నిర్మాణ ప్రాంతంలోని మట్టి బరువు మోసే సామర్థ్యం 40 టన్నులు/స్కేర్ మీటర్ నుంచి 70 టన్నులు/స్కేర్‌మీటర్‌గా చూపించి.. అందుకు అనుగుణంగానే నిర్మాణ పనులు చేపట్టారు. ఇందుకోసం ప్రైవేటు ల్యాబ్ నుంచి వచ్చిన రిపోర్టును సైతం మార్చివేశారనే ఆరోపణలు బలంగా వినపడుతున్నాయి. మట్టి బరువుమోసే సామర్థ్యాన్ని తగ్గించి చూపడంతో.. అదనంగా కాంక్రీట్, పిల్లర్లు, బేస్ కాంక్రీట్ పనులు పునాదులను వెడల్పుగా చేపట్టాల్సి వచ్చింది. జి+6 అంతస్తులతోపాటు.. పార్కింగ్ కోసం సెల్లార్ల తవ్వకాలు చేయడంతో.. మరింత దృఢంగా తయారుచేయాల్సిన అవసరం ఉందనేలా సాంకేతిక అంశా లను చూపెట్టి.. అదనపు పనులను చేపట్టినట్టు అరోపణలు గుప్పుమన్నారు. ఫౌండేషన్ తవ్వకాలు, పు టింగ్ వెడల్పు, వాటర్‌ప్రూఫింగ్, స్టీల్ పైల్స్ లాంటివి భూమి లోపలే చేపట్టాల్సి ఉంటుంది. వీటిని తూతూ మంత్రంగా చేసి.. పూర్తిచేస్తే.. భూమిలోపల ఉంటాయి కనుక ఎవరూ కనుక్కోలేరన్నమాట. అదనంగా సెల్లార్‌ను నిర్మించాల్సి వచ్చింది. దీనితో సుమారు రూ. 200 కోట్ల వరకు అంచనాలు పెరిగినట్టుగా అధికారవర్గాల్లోనే చర్చ జరుగుతోంది.

వాస్తవానికి కన్సల్టెంట్ గుర్తించిన తీవ్రమైన అంశాలపై రోడ్లు భవనాల శాఖ అధికారుల్లోనూ చర్చ జరిగినట్టుగా తెలుస్తుంది. అయితే తెరవెనుక రాష్ట్ర ప్రభుత్వంలోని కీలకమైన నేతల అజమాయిషీలో ఉండే ఉన్నతస్థాయి అధికారుల నుంచి వచ్చిన హుకూంతో.. ఆర్ అండ్ బీ అధికారులు మౌనం పాటించాల్సి వచ్చిందనే చర్చ జరుగుతోంది. నాణ్యతలోపంగా, భారీగా వ్యయం పెంచేలా పనులు చేపట్టడాన్ని వ్యతిరేకించడంతో.. కన్సల్టెంట్‌ను తప్పించే ప్రయత్నంకూడా జరిగినట్టుగా తెలుస్తుంది. అధిక వ్యయం జరగనున్న అంశాలను ప్రస్తావించకుండా.. ఇతర సాంకేతిక అంశాలను సాకుగా చూపెట్టి.. అవసరమైతే.. కన్సల్టెంట్‌ను తప్పించి.. కొత్త కన్సల్టెంట్‌ను నియమించుకుంటామనేలా హెచ్చరించినట్టుగా చర్చించుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే.. బిల్డింగ్ కమిటీకి కన్సల్టెంట్ లేఖ రాస్తూ.. అందులో సుమారు 10 అంశాలను లోతుగా విశ్లేషించి. తెరవెనుక జరుగుతున్న అంశాలను బిల్డింగ్ కమిటీ దృష్టికి తీసుకొచ్చే ప్రయత్నం చేసినట్టుగా సమాచారం. అయితే దీనిపై ఎలాంటి చర్యలు ఇప్పటివరకు లేవు. ఇక ఏం జరుగుతుందోనని అందరూ ఎదురుచూస్తున్నారు. మొత్తానికి అందరికీ న్యాయం అందించే హైకోర్టు భవన సముదాయం నిర్మాణంలో అవినీతి పునాదులు ఉండటంపై సర్వత్రా చర్చనీయాంశమయ్యింది.

## ప్రధాని మోదీ ఐదు దేశాల పర్యటనపైనే అందరి దృష్టి

దేశాల్లో సాగనుంది. ఈ ఐదు దేశాలతో భారతదేశానికి సమిష్టిగా 70 బిలియన్ డాలర్లకు పైగా ద్వైపాక్షిక వాణిజ్యం ముడిపడి ఉందని ఎస్.సి. రల్హాన్ పేర్కొన్నారు. ఇటీవల ముగిసిన భారత్‌ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం, భారత్‌ఈఎఫ్టీఏ వాణిజ్య, ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం నేపథ్యంలో ఈ పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఇది భారతీయ ఎగుమతిదారులకు సాంప్రదాయ రంగాలు మాత్రమే కాకుండా.. గ్రీన్ హైడ్రోజన్, సెమీకండక్టర్లు, రక్షణ తయారీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ వాణిజ్యం వంటి అత్యాధునిక రంగాలలో అరుదైన అవకాశాలను కల్పిస్తుందని అంచనా వేస్తున్నారు. యూఏఈతో భారతదేశ సంబంధాలు సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంగా మారాయి. మధ్యప్రాచ్యం, ఆఫ్రికా మార్కెట్లకు ఈ గల్ఫ్ దేశం భారతదేశానికి ఒక ముఖ్యమైన ముఖద్వారంగా పనిచేస్తోంది. ఈ పర్యటన ద్వారా ఇంధనం, మౌలిక సదుపాయాలు, సేవల వాణిజ్యంలో పెట్టుబడులు మరింత పటిష్టం కానున్నాయి. నెదర్లాండ్స్, ఇటలీ దేశాలతో క్లీన్ టెక్నాలజీస్, బ్లూ ఎకానమీ మరియు స్థిరమైన సప్లై చైన్ ఏర్పాటుపై చర్చలు జరగనున్నాయి. ఇది ఫార్మాస్యూటికల్స్, టెక్స్‌టైల్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు మేలు చేస్తుంది. ఓస్లో (నార్వే) లో జరిగే భారత్‌నార్డిక్ శిఖరాగ్ర సదస్సు పునరుత్పాదక ఇంధనం, వాతావరణ సాంకేతికతలు, సముద్ర రంగాలలో పరస్పర సహకారానికి ఒక అద్భుతమైన వేదిక కానుంది. 'యూరోపియన్ రౌండ్ టేబుల్ ఫర్ ఇండస్ట్రీ' లో ప్రధాని పాల్గొనడం పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచుతుంది. FIEO ఈ పర్యటనను ఒక సువర్ణావకాశంగా పేర్కొంది. అలాగే 70 బిలియన్ డాలర్ల వాణిజ్య గణాంకం అనేది ఒక ప్రాథమిక అంచనా మాత్రమే. గ్రీన్ హైడ్రోజన్ నుండి సెమీకండక్టర్ల వరకు పేర్కొన్న రంగాలలో భారతదేశం ఇంకా అంతర్జాతీయంగా పోటీ సామర్థ్యాన్ని పెంపొందించుకోవాల్సి ఉంది. ఈ పర్యటనలో నార్డిక్ దేశాల పెన్షన్ నిధులను భారత మౌలిక సదుపాయాల రంగానికి పెట్టుబడులుగా ఆకర్షించడమే అత్యంత కీలకం. ప్రపంచ వాణిజ్య మార్గాలు ఒత్తిడిలో ఉన్న తరుణంలో, ఈ పర్యటన ఫలితాలను భారత పారిశ్రామిక సంఘాలు, ఎగుమతిదారులు నిశితంగా గమనిస్తున్నారు.

## కేరళం ముఖ్యమంత్రిగా సతీశన్

**జయభేరి, తిరువనంతపురం, మే 14 :**



మే 4న కేరళం శాసనసభ ఎన్నికల ఫలితాలు వెలువడిన దాదాపు 10 రోజుల తర్వాత, ఈ రోజు (మే 14) కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రిని ప్రకటించింది. వి.డి. సతీశన్ కేరళం తదుపరి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. 140 స్థానాలున్న కేరళం అసెంబ్లీలో 102 స్థానాలు గెలుచుకున్న యూడీఎఫ్ కూటమికి సారథ్యం వహించిన ప్రతిపక్ష నేత వీడీ సతీశన్ ఇప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టబోతున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన పది రోజుల వరకు ముఖ్యమంత్రి ఎవరనే దానిపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. కాంగ్రెస్ అధిష్ఠానం ముందు ముగ్గురు కీలక నేతలు వీడీ సతీశన్, కేసీ వేణుగోపాల్, రమేషన్ చెన్నితల రేసులో నిలిచారు. మెజారిటీ ఎమ్మెల్యేలు వేణుగోపాల్ వైపు మొగ్గు చూపినప్పటికీ క్షేత్రస్థాయిలో పార్టీ కేడర్, సామాన్య ప్రజానీకం సతీశన్ వైపు నిలబడటంతో కాంగ్రెస్ ఆ పేరును ఎంపిక చేసింది. పార్టీ కార్యకర్తల నుంచి ఒత్తిడి, యూడీఎఫ్ మిత్రపక్షాలైన ముస్లిం లీగ్ వంటి పార్టీల మద్దతుతో కాంగ్రెస్ హైకమాండ్ సతీశన్ వైపు మొగ్గు చూపింది. క్యాంపస్ రాజకీయాల నుంచి క్లిఫ్ హౌస్ వరకు 1964మే 31న ఎర్నాకులం జిల్లా నెట్టూరులో జన్మించిన సతీశన్, విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో చురుగ్గా ఉండే వారు. మహాత్మా గాంధీ యూనివర్సిటీ యూనియన్ ఛైర్మన్‌గా పని చేసిన ఆయన తర్వాత నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా కార్యదర్శిగా ఎదిగారు. వృత్తిరీత్యా న్యాయవాది అయిన సతీశన్, సుమారు పదేళ్ల పాటు కేరళం హైకోర్టులో ప్రాక్టీస్ చేశారు. 1996లో రాజకీయాల్లోకి వచ్చి పరవూరు నుంచి పోటీ చేసి ఓడిపోయారు. తర్వాత నిరంతరం ప్రజల్లో ఉంటూ 2001లో అదే స్థానం నుంచి విజయం సాధించి అసెంబ్లీలో అడుగు పెట్టారు. అప్పటి నుంచి నేటి వరకు పరవూరును అజేయమైన కోటగా మార్చుకున్నారు. 2026 ఎన్నికల ప్రచారంలో యూడీఎఫ్ వంద శాతానికిపైగా సీట్లు సాధిస్తుంది ఆయన ముందే చెప్పారు. కేరళంలో విజయం సాధించిన తర్వాత ముఖ్యమంత్రిగా ఎవరిని నియమించాలనే విషయంపై జాప్యం జరిగింది. పది రోజులుగా ఈవిషయాన్ని సాగదీయడంపై విమర్శలు వెల్లువెత్తాయి. చివరకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీతో పాటు ఇతర సీనియర్ పార్టీ నాయకులు హాజరైన ఒక ఉన్నత స్థాయి కాంగ్రెస్ నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం పేరు ప్రకటించారు. 140 మంది సభ్యులున్న కేరళం అసెంబ్లీలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ 102 సీట్లు గెలుచుకుని మెజారిటీ సాధించింది. అయినప్పటికీ, ముఖ్యమంత్రిని నిర్ణయించడంలో జరిగిన జాప్యంపై ప్రశ్నలు తలెత్తాయి. ముఖ్యమంత్రి పేరును ప్రకటించడంలో జాప్యం చేసినందుకు ప్రతిపక్షాలు కాంగ్రెస్ పార్టీని విమర్శించగా, పార్టీలో కూడా అసంతృప్తి స్పష్టంగా కనిపించింది. వయనాడ్‌లోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సమీపంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాలను విమర్శిస్తూ పోస్టర్లు వెలిశాయి. రాష్ట్రంలో ప్రభుత్వ వ్యతిరేక సెంటిమెంట్ నెలకొని ఉన్నప్పటికీ, ఈ ఇద్దరు నాయకులు కేసీ వేణుగోపాల్‌ను కేరళం ముఖ్యమంత్రిని చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆ పోస్టర్లలో విమర్శలు చేశారు.

# మూలయం కొడుకుది హత్యే

✍ జయభేరి, లక్నో, మే 14 :



సమాజవాదీ పార్టీ వ్యవస్థాపకుడు ములాయం సింగ్ యాదవ్ చిన్న కుమారుడు ప్రతీక్ యాదవ్ మరణంపై పోస్టుమార్టం నివేదికలో కొన్ని కీలక మైన , అనుమానాస్పద అంశాలు వెలుగులోకి వచ్చాయి. ప్రాథమిక నివేదిక ప్రకారం, ఆయన ఊపిరితిత్తులలోని రక్తనాళాల్లో పెద్ద ఎత్తున రక్తం గడ్డకట్టడం వల్ల గుండె, శ్వాస వ్యవస్థలు ఆగిపోయి మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. అయితే, ఆయన శరీరంతో పాటు ఊపిరితిత్తుల్లో లభించిన గడ్డకట్టిన రక్తాన్ని మరింత లోతుగా విశ్లేషించేందుకు హిస్టోపాథాలజికల్ పరీక్షల కోసం భద్రపరిచారు. అత్యంత అనుమానాస్పదమైన విషయం ఏమిటంటే, ప్రతీక్ యాదవ్ శరీరంపై 6 అంతర్గత గాయాలు ఉన్నట్లు పోస్టుమార్టం నివేదికలో తేలింది. వీటిలో మూడు గాయాలు మరణానికి సుమారు 5 నుండి 7 రోజుల ముందు తగిలినవి కాగా, మిగిలిన మూడు గాయాలు మరణానికి ఒక రోజు ముందు తగిలినవిగా గుర్తించారు. ఛాతి, భుజం కింద ,మణికట్టు భాగాల్లో ఉన్న ఈ గాయాలు ఎలా తగిలాయనే దానిపై స్పష్టత లేకపోవడంతో సస్పెన్స్ నెలకొంది. ఈ గాయాల వెనుక ఉన్న కారణాలను తెలుసుకోవడానికి ఫోరెన్సిక్, కెమికల్ అనాలిసిస్ రిపోర్టుల కోసం అధికారులు ఎదురుచూస్తున్నారు.2003లో ములాయం సింగ్ మొదటి భార్య మాలతీ దేవి మరణించిన తర్వాతే, సాధనా గుప్తా, ప్రతీక్ యాదవ్‌ల ఉనికి ప్రపంచానికి తెలిసింది. అంతకుముందు దశాబ్దకాలం పాటు ఈ బంధం ఒక రహస్యంగానే సాగింది. ప్రతీక్ పేరు బయటకు రావడంతో ఎస్పీలో రెండు వర్గాలు ఏర్పడ్డాయి. ఒక వర్గం అఖిలేష్‌కు మద్దతుగా నిలిస్తే, మరో వర్గం సాధనా గుప్తా ప్రభావంతో ప్రతీక్‌ను రాజకీయాల్లోకి తీసుకురావాలని ప్రయత్నించింది. ముఖ్యంగా ములాయం తమ్ముడు శివపాల్ యాదవ్, అఖిలేష్ మధ్య జరిగిన ఆధిపత్య పోరాటంలో ప్రతీక్ పేరు తరచుగా వినిపించేది. తల్లి సాధనా గుప్తా, బాబాయ్ శివపాల్ యాదవ్ ఒత్తిడి చేసినప్పటికీ, ప్రతీక్ యాదవ్ రాజకీయాల్లోకి రావడానికి ఎప్పుడూ ఆసక్తి చూపలేదు. ఆయన తన జీవితాన్ని ఫిట్‌నెస్, రియల్ ఎస్టేట్ వ్యాపారానికే అంకితం చేశారు. లక్నోలో జిమ్ నెట్‌వర్క్ నడుపుతూ, బాడీ బిల్డింగ్‌లో తనదైన గుర్తింపు తెచ్చుకున్నారు. 2012లో అజంగఢ్ నుంచి పోటీ చేయాలని పార్టీ కార్యకర్తలు డిమాండ్ చేసినా ఆయన సున్నితంగా తిరస్కరించారు. రాజకీయ గొడవలకు దూరంగా ఉండాలని కోరుకున్నా, కుటుంబ రాజకీయాలు ఆయనను వదల్లేదు. ప్రతీక్ యాదవ్ వ్యక్తిగత జీవితం కూడా ఎన్నో ఒడిదుడుకులతో సాగింది. 2011లో అపర్ణా బిష్త్‌ను వివాహం చేసుకున్న ప్రతీక్, ఆమె 2022లో ఎస్పీని వీడి బీజేపీలో చేరడంతో ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొన్నారు. అపర్ణ నిర్ణయం కుటుంబంలో చీలిక తెచ్చిందని ప్రతీక్ భావించేవారు. ఈ ఏడాది జనవరిలో ఆమెపై ఇన్‌స్టాగ్రామ్ వేదికగా తీవ్ర విమర్శలు చేస్తూ.. నా కుటుంబ సంబంధాలను నాశనం చేసిన స్వార్థపరురాలు, త్వరలోనే విడాకులు ఇస్తాను అని సంచలన పోస్ట్ చేశారు. అయితే, ఆ తర్వాత కొద్దిరోజులకే మళ్ళీ రాజీ పడ్డారు.ముప్పై ఎనిమిదేళ్ల చిన్న వయసులోనే ప్రతీక్ యాదవ్ మరణించడం యాదవ్ కుటుంబంలో తీరని లోటును మిగిల్చింది. ములాయం వారసుడిగా రాజకీయాల్లో చక్రం తిప్పే అవకాశం ఉన్నా, తనకంటూ ఒక ప్రత్యేక ప్రపంచాన్ని నిర్మించుకున్న ప్రతీక్ ప్రస్థానం విషాదాంతమైంది. ఆయన మరణం చుట్టూ ఉన్న రహస్యాలు ,కుటుంబ కలహాలు మరోసారి యూపీ రాజకీయాల్లో చర్చకు దారితీస్తున్నాయి.



## మంచి నీటి సమస్య పై జలమండలి అధికారులను కలిసిన కొత్త రవి గౌడ్

✍ జయభేరి, మేడిపల్లి, మే 14 :

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ చెంగిచెర్ల డివిజన్లో మంచి నీటి సమస్య ఉందని డివిజన్ పరిధిలోని పలు కాలనీల ప్రజలు మాజీ డిప్యూటీ మేయర్ సీనియర్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు చెంగిచెర్ల గ్రామ పంచాయతీ మాజీ ఉపసర్పంచ్ కొత్త రవి గౌడ్ దృష్టికి తీసుకు రావడంతో డివిజన్ నాయకులు, పలు కాలనీల బాధితులతో కలిసి చెంగిచెర్ల జలమండలి కార్యాలయంలో అధికారులను కలసి డివిజన్లో మంచి నీరు సమస్య అధికంగా ఉన్నాదని ముఖ్యంగా వికర్ సెక్షన్ కాలనీలలో మంచి నీటి సమస్య అధికంగా ఉన్నాదని కొన్ని కాలనీలలో బోర్లు కూడా లేవని దయచేసి వాళ్లకు క్రమంతప్పకుండా మంచి నీరు ఇవ్వాలని జలమండలి అధికారులను కొత్త రవి గౌడ్ కోరడమైనది. సానుకూలంగా స్పందించిన అధికారులు తప్పకుండా క్రమంతప్పకుండా మంచి నీరు ఇస్తాం అని అన్నారు.

## సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి



✍ జయభేరి, కాప్రా :

డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని అణుపురం సొసైటీ ప్రాంతంలో నెలకొన్న డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి సంబంధించి కీలక సమావేశం నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వాటర్ వర్క్స్ ఎండీ అశోక్ రెడ్డి ఐఏఎస్ ని ఖైరతాబాద్ వాటర్ వర్క్స్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను వివరించారు. అణుపురం సొసైటీ ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ ఇబ్బందులను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. దీనిపై స్పందించిన వాటర్ వర్క్స్ అధికారులు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు మౌలిక వసతులు మెరుగుపరచడం తమ ప్రాధాన్యత అని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. స్థానిక సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండి పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, BRS పార్టీ నాయకులు రహీం కాలనీ వాసులు రామకృష్ణ రావు భగీరథ్ తదితరులు పాల్గొన్నారు.



## అంబేద్కర్ ఆశయ సాధన కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యం

- దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్
- తిరుమలయ్య పల్లి లో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే జిఎంఆర్

✍ జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని మదనాపురం మండలం తిరుమలయ్య పల్లి లో గురువారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచ మేధావి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. అన్ని వర్గాలకు సమహక్కులు కల్పిస్తూ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించారన్నారు. అంబేద్కర్ స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీ ముందుకు పోతుందన్నారు. అంబేద్కర్ ఆశయ సాధన కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమ వుతుందన్నారు. ప్రతి ఒక్కరు అంబేద్కర్ ఆశ సాధనకు కృషి చేద్దామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలలో ఎమ్మెల్యే జీఎంఆర్



✍ జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని కొత్తకోట మండలం రామకృష్ణాపురంలో గురువారం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాలలో ఎమ్మెల్యే జిఎంఆర్ పాల్గొన్నారు. అనంతరం తమ కుటుంబం తరఫున ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఎమ్మెల్యే జిఎంఆర్ నూతన వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు యువకులు, ఇందిరమ్మ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## డ్రగ్స్, నేరాలను అరికట్టే బాధ్యత మనందరి పై ఉంది

- సీఐ శంకర్యయ్య,ఎస్సై ఉదయ్ భాస్కర్, కొత్త రవి గౌడ్
- చెంగిచెర్లలో డ్రగ్స్, రోడ్ సేఫ్టీ, సీసీ కెమెరాల ఎర్పాటు పై అవగాహన నిర్వహించిన మేడిపల్లి పోలీసులు

✍ జయభేరి, మేడిపల్లి, మే 13 :




మల్కాజ్గిరి కమిషనరేట్ మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్ చెంగిచెర్ల జై శ్రీ రామ్ కాలనీలో "డ్రగ్స్ పై మరియు రోడ్ సేఫ్టీ, సీసీ కెమెరాల" ఎర్పాట్ల పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం మేడిపల్లి ఎస్సై ఉదయ్ భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ కార్యక్రమంని ముఖ్యఅతిధులుగా మేడిపల్లి సీఐ శంకర్యయ్య మరియు బోడుప్పల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ సీనియర్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు చెంగిచెర్ల గ్రామ పంచాయతీ మాజీ ఉపసర్పంచ్ కొత్త రవి గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ శంకర్యయ్య మాట్లాడుతూ డ్రగ్స్ వాడకం యువత భవిష్యత్తును దెబ్బతీస్తుందని, ఆరోగ్యాన్ని నాశనం చేస్తుందని కాలనీ వాసులకు వివరించారు. అనంతరం ఎస్సై ఉదయ్ భాస్కర్, కొత్త రవి గౌడ్ మాట్లాడుతూ డ్రగ్స్ వాడకంతో చదువు, ఉద్యోగాలు, కుటుంబ సంబంధాలు నశించిపోతాయని, వాటిని దూరం పెట్టి క్రీడలు, హాబీలు, పుస్తకాలు వంటి మంచి అలవాట్లు పెంపొందించుకొని సమాజాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. అదేవిధంగా కాలనీలో ప్రతి ఒక్కరు సిసి కెమెరాలు ఎర్పాటు చేసుకోవాలని సిసి కెమెరాల వలన నేరాలు చాలావరకు కట్టడి చేయవచ్చు అలాగే మహిళల పట్ల జరిగే నేరాలు చిన్న పిల్లల పట్ల జరిగే నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ,మహిళలపై నేరాలు సమాజానికి మచ్చవంటివని అటువంటి నేరాలను వ్యతిరేకించే ధైర్యం చూపాలని పిలుపునిచ్చారు. ఎక్కడైనా డ్రగ్స్ గాని మహిళలపై వేధింపులు, అనుచిత ప్రవర్తన, నేరాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరడమైనది. ఈ సందర్భంగా కాలనీ వాసులు మేడిపల్లి సీఐ, ఎస్సై, మరియు కొత్త రవి గౌడ్ లను శాల్వాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జై శ్రీ రామ్ కాలేజీ అధ్యక్షులు ఆర్.పి. గౌడ్, వైఎస్ ప్రెసిడెంట్ సందీప్ చారి,జనరల్ సెక్రటరీ పి.సత్యనారాయణ,ట్రెజర్ ఎస్. వెంకట్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ దామోదర్ రెడ్డి, వెంకటేశ్వర్లు,రవి, సందీప్, రవీందర్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి, నరేష్, కృష్ణ, దేవేందర్ రెడ్డి, మరియు కాలనీ వాసులు మహిళాలు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యాదాద్రి వాసుడికి నిత్యపూజలు

- శ్రీవారి నిత్య రాబడి రూ.29.97 లక్షలు

✍ జయభేరి, యాదగిరిగుట్ట, మే 14 :



తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారికి నిత్యపూజలు కొనసాగుతున్నాయి. గురువారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసుదర్శన నారసింహ హోమం,నిత్య కల్యాణం, నిత్య బ్రహ్మోత్సవం, వెండి జోడి సేవ, స్వర్ణ పుష్పార్చన, శ్రీసత్యనారాయణ స్వామి వ్రత పూజలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకొని ఆలయంలో జరిగిన నిత్యపూజలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.




### శ్రీనార సింహుడి నిత్యరాబడి..

శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారికి నిత్యరాబడిలో భాగంగా గురువారం రూ.29,97,382 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.1,67,400, బ్రేక్ దర్శనం ద్వారా రూ.1,88,100, శ్రీసత్యనారాయణ స్వామి వ్రత పూజల ద్వారా రూ.2,32,000, వీఐపీ దర్శనం ద్వారా రూ.4,21,050, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.4,30,500, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.63,916, ప్రసాద విక్రయం ద్వారా రూ.10,03,850, కల్యాణ కట్ట ద్వారా రూ.1,05,000తో పాటు వివిధ శాఖలు, పాతగుట్ట ఆలయం ద్వారా ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

## శంకర విద్యాలయ పాఠశాల ప్రారంభోత్సవం

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి




✍ జయభేరి, ఉప్పల్ :

మల్లాపూర్ డివిజన్ పరిధిలోని శక్తి సాయి నగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన శంకర విద్యాలయ పాఠశాలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేసిన స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్లు జెరిపోతుల ప్రభుదాస్, పన్నాల దేవేందర్ రెడ్డి, గుండారపు శ్రీనివాస్ రెడ్డి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రిన్సిపాల్ తులసికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, స్థానిక పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలని, అలాగే పేద విద్యార్థులకు ఫీజుల విషయంలో సానుకూలంగా ఉండాలని, విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు మాటలు వేయాలని సూచించారు. పాఠశాల యాజమాన్యం తమదైన శైలిలో విద్యాబుద్ధులు నేర్పిస్తూ మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించాలని ఆశించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉస్మాన్, కత్తుల రాజ్ కుమార్, శేఖర్ గౌడ్, దేవేందర్ కుమార్, పృథ్వీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సైదాపురం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం



✍ జయభేరి, యాదగిరిగుట్ట, మే 14 :

యాదగిరిగుట్ట మండలంలోని సైదాపురం గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని సైదాపురం గ్రామ సర్పంచ్ రోజాదర్శన్, ఉప సర్పంచ్ దుంబాల వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. ఉచిత వైద్య శిబిరంలో మొత్తం 125 మందిని పరీక్షించినట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్.పావణి,డాక్టర్ హర్షకుమార్,హేమలత,టీబీ వైద్య బృందం నటేష్, మానస, ఏఎన్ఎం సుధారాణి, పూలమ్మ, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇల్లు ప్రారంభించిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల

**జయభేరి, యాదగిరిగుట్ట, మే14 :**

యాదగిరిగుట్ట మున్సిపల్ పరిధిలోని గుండ్లపల్లిలో ఇందిరమ్మ ఇల్లును ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రారంభించారు. గురువారం లబ్ధిదారులు గుండ్లపల్లి సారిక సత్యంగౌడ్ ఇందిరమ్మ ఇల్లును బీర్ల అయిలయ్య ప్రారంభించి వారికి పట్టువస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుందని, ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు పేరబోయిన సత్య నారాయణ,బూడిద మధు,ముక్కెర్ల మల్లేష్‌యాదవ్, కాంగ్రెస్ నేతలు గుండ్లపల్లి భరత్ గౌడ్, బరిగె రాంచందర్,బందారపు భిక్షపతితో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఐకెపి సెంటర్‌లలోని వరి ధాన్యాన్ని తక్షణమే తరలించాలి



**జయభేరి, యాదగిరిగుట్ట, మే 14 :**

ఐకేపీ సెంటర్‌లలో ఉన్న వరి ధాన్యాన్ని తక్షణమే తరలించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు. గురువారం యాదగిరిగుట్ట తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి డిప్యూటీ తహశీల్దార్ సత్యంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పశ్య పద్మ మాట్లాడుతూ రైతుల నుండి కొనుగోలు చేస్తున్న వరి ధాన్యం ఐకెపి సెంటర్‌లలో నిల్వ ఉంటుందని,అందువల్ల వరి తరుగుదల పెరగడంతో పాటు,అకాల వర్షాలు పడితే నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. మిల్లులలో జరుగుతున్న జాప్యం పట్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని తక్షణమే ఐకెపి సెంటర్లలో ఉన్న ధాన్యాన్ని తరలించాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని ఆర్టికల్ 243 ప్రకారం ఉన్నప్పటికీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నామినేట్ పాలక మండలి ఏర్పాటు చేయాలని చూడడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లూరి రాజయ్య, మహిళ సంఘం జిల్లా కార్యదర్శి బండి జంగమ్మ, రైతు సంఘం మండల కార్యదర్శి పేరబోయిన బంగారి,నేతలు బబ్బూరి శ్రీధర్,పేరబోయిన పెంటయ్య, కోకల రవీందర్,గుండు వెంకటేష్,తుమ్మల ఇస్తారి, ముక్కెర్ల పెంటయ్య,స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయం

- దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్



**జయభేరి, దేవరకద్ర :**

నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని భూత్పూర్ మండలం పెద్దతండ, కొత్తూరు, షేర్ పల్లి, హస్నాపూర్ గ్రామాలలో గురువారం ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాలలో ఎమ్మెల్యే జిఎంఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తమ కుటుంబం తరపున ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే ప్రసంగించారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమన్నారు. అన్ని వర్గాల వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు, యువకులు, మహిళలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో ప్రశాంత్ రెడ్డి



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని ఆయా గ్రామాలలో గురువారం జరిగిన పలు శుభకార్యాలలో దేవరకద్ర నియోజకవర్గం బిజెపి పార్టీ ఇన్చార్జి కొండ ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మూసాపేట్ మండలం వేములలో బీజేవైఎం కన్వీనర్ విష్ణు వివాహ వేడుకకు ప్రశాంత్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే అక్కడ గృహప్రవేశ కార్యక్రమంలో కూడా ఆయన పాల్గొన్నారు. అడ్డాకుల మండలం కందూరులో అశోక్ కుమారుని మొదటి పుట్టినరోజు వేడుకలకు ప్రశాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అక్కడ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్డాకుల మండల పార్టీ అధ్యక్షుడు రమేష్, జిల్లా కార్యదర్శి గట్టు మల్లేష్, సుందరయ్య, బిజెపి సీనియర్ మహిళా నాయకురాలు లక్ష్మి, ప్రవీణ్, సుధాకర్ రెడ్డి, విష్ణువర్ధన్, శివ లతోపాటు మండల పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నీట్ గా లీక్ చేసేశారు

**జయభేరి, జైపూర్, మే 14 :**




ఎంబీబీఎస్, బీడీఎస్ వంటి వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే అర్హత పరీక్ష నీట్ 2026ను రద్దుచేశారు. పరీక్షకు రెండు రోజుల ముందే ప్రశ్నాపత్రం లీక్ కావడంతో కేంద్ర ప్రభుత్వం సూచనలతో ఎన్టీఏ రద్దుచేసిన సంగతి తెలిసిందే. అయితే, తొలుత ఈ పరీక్షా పత్రాన్ని పుణేకు చెందిన అనుమానితుడు నుంచి ఓ విద్యార్థి కొనుగోలు చేశాడు. అతడు రూ.10 లక్షలకు కొని, దానిని రూ.15 లక్షలు తిరిగి అమ్మినట్లు సీబీఐ దర్యాప్తులో వెల్లడయ్యింది.ప్రశ్నాపత్రం లీక్ ఆరోపణలతో యూజీ నీట్ 2026ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ మంగళవారం రద్దుచేసింది. ఈ ప్రభావం 22 లక్షల మంది విద్యార్థులపై పడింది. ఈ కుంభకోణం మహారాష్ట్రలోని నాసిక్‌లో ప్రారంభమైంది. అక్కడ పేపర్ మొదటి డిజిటల్ కాపీ బయటపడింది.

నివేదికల ప్రకారం.. పుణేకు చెందిన అనుమానితుడి నుంచి లీక్ అయిన పేపర్‌ను కొనుగోలు చేసి, ఆపై దానిని రూ. 5 లక్షల లాభంతో విక్రయించాడనే ఆరోపణలపై నాసిక్‌కు చెందిన శుభమ్ ఖైర్నార్‌ను సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) అదుపులోకి తీసుకుంది.మహారాష్ట్ర తర్వాత హర్యానాలోని గురుగ్రామ్, రాజస్థాన్‌లోని ప్రధాన కోచింగ్ సెంటర్ జైపూర్, సికార్ అలాగే జమ్మూ కశ్మీర్, బీహార్, కేరళతో సహా అనేక రాష్ట్రాలకు వ్యాపించింది. నాసిక్‌లోని ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన 30 ఏళ్ల శుభమ్ ఖైర్నార్ బీఏఎంఎస్ విద్యార్థి. లీకైన నీట్ పర్‌ను పుణేకు చెందిన అనుమానితుడి నుంచి రూ.10 లక్షలకు కొనుగోలు చేసి హర్యానాలోని ఓ వ్యక్తికి రూ.15 లక్షలకు విక్రయించి రూ.5 లక్షల లాభం పొందినట్లు ఆరోపణలు వచ్చాయి. ఎన్‌క్రిప్టెడ్ మెసేజింగ్ అప్లికేషన్ ద్వారా పేపర్ సర్క్యులేట్ అయిందని నివేదికలు చెబుతున్నాయి. మంగళవారం మధ్యాహ్నం శుభమ్‌ను సీబీఐ అదుపులోకి తీసుకుంది. తనను గుర్తించకుండా జుత్తు కత్తిరించి తన రూపురేఖలను మార్చుకున్నాడని దర్యాప్తు అధికారులు తెలిపారు. అయితే, అధికారుల ముందు అతడి ప్రయత్నాలు ఫలించలేదు. సాంకేతికత సాయంతో అతడిని గుర్తించారు. అతడ్ని అదుపులోకి తీసుకున్న తరువాత... తండ్రి మధుకర్ ఖైర్నార్ తన కొడుకుపై వచ్చిన ఆరోపణలు నిరాధారమైనవని పేర్కొన్నారు. పేపర్ లీక్ రాకెట్‌తో శుభమ్‌కు ఎలాంటి సంబంధం లేదని ఆయన తెలిపారు. కానీ, నిజానిజాలు నిగ్గుతేల్చేందుకు నిష్పక్షపాతంగా, సమగ్రంగా విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.పేపర్ లీక్‌లో పోర్టబుల్ స్కానర్‌లు, క్లిష్టమైన టెలిగ్రామ్ నెట్‌వర్క్, షాడో సర్వర్‌లతో సహా అధునాతన సాంకేతికతలను ఉపయోగించినట్టు నివేదికలు పేర్కొన్నాయి. నివేదికల ప్రకారం, పరీక్షకు దాదాపు 45 గంటల ముందు పేపర్ సర్క్యులేట్ అయ్యింది.

కేరళలో చదువుతున్న సికార్ విద్యార్థి హాస్టల్ నడుపుతున్న తన తండ్రికి "గెస్ పేపర్" పీడీఎఫ్ పంపినట్లు ఆరోపణలు రావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.పరీక్ష రోజు ఉదయం హాస్టల్‌లో ఉండే విద్యార్థులకు పేపర్ ఇచ్చేందుకు ప్రయత్నించగా.. వారు అప్పటికే సెంటర్లకు వెళ్లిపోయారని సమాచారం. పరీక్ష ముగిసిన తర్వాత, పేపర్‌ను కెమిస్ట్రీ, బయాలజీ లెక్చర్లకు చూపించడంతో 108 కెమిస్ట్రీ ప్రశ్నలకు 45, 204 బయాలజీ ప్రశ్నలకు 90 అసలు పరీక్ష పేపర్‌తో సరిపోలింది. సికార్‌లోని కొన్ని కోచింగ్ కేంద్రాలు గెస్ పేపర్స్ ఉపయోగించి నీట్‌కు సిద్ధం కావాలని కోరినట్లు విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. కొందరికి పీడీఎఫ్ కాపీలు అందగా, మరికొందరికి లీకైన పేపర్‌కి సంబంధించిన అసలు కాపీలు ఇచ్చినట్లు సమాచారం. ఫిర్యాదు చేయడానికి ఉపాధ్యాయులు ప్రయత్నించినా.. సికర్ పోలీసులు కేసు నమోదు చేయడానికి నిరాకరించారు. దీంతో వారు నేరుగా NTAకి మెయిల్ పంపడంతో ఇంటెలిజెన్స్ బ్యూరో (IB) కి సమాచారం అందించింది. చివరకు రాజస్థాన్ పోలీసులు రంగంలోకి దిగి, దర్యాప్తు చేపట్టడంతో గుట్టు బయటపడింది.

# ప్రభుత్వ బడిలోనే మెరుగైన విద్య అందుతుంది

- ఎంఈఓ శ్రీదేవి, సర్పంచ్ భరత్ బాబు

**జయభేరి, దంతాలపల్లి, మే14:**



మండలం పెద్దముప్పారం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఈరోజు బడిబాట మరియు తల్లిదండ్రుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పెద్ద ముప్పారం సర్పంచ్ కందిమల్ల భరత్ బాబు హాజరయ్యారు.ఈ సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఎంఈఓ శ్రీదేవి మాట్లాడుతూ 6 నుంచి 14 సంవత్సరాల లోపు బాలబాలికలందర్నీ పాఠశాలలో చేర్పించాలని, ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల ప్రోత్సాహకాలని ఉపయోగించుకోవాలని తెలియజేశారు. సర్పంచ్ గారు మాట్లాడుతూ పాఠశాలకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను అందజేస్తామని, పాఠశాల భద్రత కోసం సీసీ కెమెరా ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు. పాఠశాల కరపత్రాన్ని ఆవిష్కరించడం మరియు పదవ తరగతి లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం చేయడం జరిగింది. ఈ సమావేశంలో ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషన్ నాయక్ ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు శంకరయ్య వార్డు మెంబర్లు పూర్వ విద్యార్థులు తల్లిదండ్రులు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# బడిబాట కార్యక్రమం ఘనంగా నిర్వహణ

- ప్రధానోపాధ్యాయులు పి.వేణుమాధవరెడ్డి
- సర్పంచ్ పొన్నోటి బాలాజీ

**జయభేరి, దంతాలపల్లి, మే14 :**




దంతాలపల్లి జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణంలో జయశంకర్ బడిబాట కార్యక్రమం ఘనంగా,నిర్వహించబడింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధి, విద్యార్థుల చేరికలు పెంపు మరియు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ ప్రజలకు ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతను తెలియజేస్తూ విద్యార్థులను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని అవగాహన కల్పించారు.పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్ నిర్వహణ. ఈ సందర్భంగా పేరెంట్స్ అండ్ టీచర్స్ సమావేశం నిర్వహించి విద్యార్థుల విద్యా ప్రగతి, క్రమశిక్షణ, హాజరు, భవిష్యత్ లక్ష్యాలపై ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో చర్చించారు. విద్యార్థుల అభివృద్ధికి తల్లిదండ్రులు - ఉపాధ్యాయులు కలిసి పనిచేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి .వేణు మాధవరెడ్డి సూచించారు. గ్రామ అభివృద్ధికి విద్య ఎంతో ముఖ్యమని గ్రామ సర్పంచ్ శ్రీ పొన్నోటి బాలాజీ గారు తెలిపారు.10వ తరగతి విద్యార్థులకు సన్మాన కార్యక్రమం ఇటీవల 10వ తరగతి పరీక్షల్లో అధిక మార్కులు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకొచ్చిన విద్యార్థులను ప్రత్యేకంగా సన్మానించారు. విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని తెలియజేశారు.



వరకద్ర మండలం అడవి అజిలాపురం, చిన్నరాజమూర్, నార్లోని కుంట గ్రామాల్లో ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమాలలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు తమ కుటుంబం తరపున నూతన వస్త్రాలను అందజేసి వారికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. అలాగే చిన్న రాజమూర్, దాడి తండా, నార్లోని కుంట గ్రామాల్లో పలు వివాహాలకు ఎమ్మెల్యే జిఎంఆర్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





## జూన్ 2 నుంచి రెండవ విడత ఇందిరమ్మ ఇండ్లు

- ఎమ్మెల్యే జిఎంఆర్ వెల్లడి

**జయభేరి, దేవరకద్ర :**

జూన్ 2 నుంచి రెండవ విడత ఇందిరమ్మ ఇండ్లు వస్తాయని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) తెలిపారు. సొంత ఇల్లు లేని వారికి ఇది ఒక శుభవార్త లాంటిదన్నారు. జూన్ 2వ తేదీన రెండవ విడత, ఇందిర ఇండ్ల మంజూరు ప్రక్రియను ప్రజా ప్రభుత్వం ప్రారంభిస్తుందన్నారు. కులం, మతం, రాజకీయాలకు అతీతంగా పేదల గౌరవపు చిరునామా ఇందిరమ్మ ఇళ్లను ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇస్తుందన్నారు. మొదటి విడత ఇందిరమ్మ ఇండ్లను ఇదివరకే విజయవంతంగా లబ్ధిదారులకు అందించడం జరిగిందన్నారు. రెండవ విడత, మూడవ విడత, నాలుగవ విడతలో కూడా ఇండ్లు లేని ప్రతి పేదవాడికి ఇల్లు అందించే లక్ష్యంగా ప్రతి గ్రామం, పట్టణం, మున్సిపాలిటీలలో ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు. ఈ విషయంలో ఎటువంటి అనుమానాలకు తావు లేదని ఆయన స్పష్టం చేశారు

## చెక్ డ్యాం పనులను పరిశీలించిన మాజీ సర్పంచ్



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మండలం మర్రిచెట్టు తండా గ్రామపంచాయతీ పరిధి వాగులో నిర్మిస్తున్న చెక్ డ్యాం పనుల పురోగతిని EE తదితర ఇంజనీర్లతో కలిసి చెక్ డ్యామ్ పనులను పరిశీలించిన జాతీయ ఉత్తమ సర్పంచ్ అవార్డు గ్రహీత మాజీ సర్పంచ్ శ్రీనివాస్ నాయక్ ఈ చెక్ డ్యాం పూర్తయిన తర్వాత కొన్ని వందల ఎకరాలకు నీరు అందుతుందని తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో అధికారులు మాజీ సర్పంచ్ శ్రీనివాస్ నాయక్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## శుభకార్యాలలో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లాలోని దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని కొత్తకోట, మదనాపురం మండలాలలో గురువారం జరిగిన పలు వివాహాలకు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) హాజరయ్యారు.ఈ సందర్భంగా నూతన వధూవరులను ఎమ్మెల్యే జిఎంఆర్ ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాపతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



**జయభేరి, రాయచోటి :**

జిల్లాలో విద్యాభివృద్ధి, విద్యా ప్రమాణాల మెరుగుదల, విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంపు లక్ష్యంగా పనిచేయాలని విద్యాశాఖ అధికారులకు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లోపాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్య, సమగ్ర శిక్షా , స్కిల్ డెవలప్మెంట్ మరియు అనుబంధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. రాష్ట్రం లో ఈ విద్యా సంవత్సరానికి గాను "బడి పిలుస్తోంది" కార్యక్రమానికి సంబంధించి ప్రస్తుతం విద్యార్థుల నమోదు పరంగా జిల్లా ఆరో స్థానంలో ఉన్నదని ,రాబోయే రోజుల్లో ఇంకా మెరుగైన స్థానాల్లో నిలవడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని అన్నారు. రాయచోటి, పీలేరు, మదనపల్లి, వాయల్పాడు, గాలివీడు, పుంగనూరు తదితర ఆరు మండలాల్లో నమోదు ప్రక్రియ చాలా తక్కువగా ఉందని సంబంధిత మండలాల అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారికి సూచించారు.జిల్లాలోని 89 మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 60 కంటే తక్కువగా ఉన్న నేపథ్యంలో, ఆయా పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు ఇంకా మెరుగుపడేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పదో తరగతి ఫలితాల విశ్లేషణలో సైన్స్ మరియు తెలుగు సబ్జెక్టుల్లో ఎక్కువ మంది విద్యార్థులు ఫెయిల్ అయినట్లు గుర్తించి, వారికి ప్రత్యేక రిమీడియల్ తరగతులు నిర్వహించి అందరూ ఉత్తీర్ణులు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వచ్చే విద్యాసంవత్సరం మొదటి నుంచే సైన్స్ మరియు తెలుగు సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. జి ఎఫ్ ఎల్ ఎన్ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ప్రాథమిక చదువు, లెక్కల సామర్థ్యాల పెంపుపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. మార్చిలో నిర్వహించిన ఎండ్‌లైన్ పరీక్షల్లో 898 పాఠశాలలు మంచి ఫలితాలు సాధించాయని, వచ్చే ఏడాదికి కనీసం 75 శాతం పాఠశాలలు ఈ స్థాయికి చేరుకోవాలని లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు. మన బడి మన భవిషత్తు పనులను ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే సకాలంలో పనులు ప్రారంభించి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకం మరియు ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో సానుకూల అభిప్రాయం పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు నిర్వహించాలని సూచించారు.ఇంటర్మీడియట్ ఫలితాల శాతం పెంచేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు.

స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాల ద్వారా ఇప్పటివరకు శిక్షణ పొంది ఉద్యోగాలు పొందిన వారి పూర్తి వివరాల నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డిఐఈఓ రవి, డిఈవో సుబ్రహ్మణ్యం, సమగ్ర శిక్ష ఏపీసీ అనురాధ, స్కిల్ డెవలప్మెంట్ అధికారి నాగార్జున తదితరులు పాల్గొన్నారు. అలాగేరాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యా మండలి ఆదేశాల మేరకు జిల్లాలో ఈ నెల 21 నుండి ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు డిఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా సమన్వయ కమిటీ సమావేశం డిఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్ రవితో కలిసి పోలీస్, వైద్య, విద్యుత్, ఆరోగ్య, రవాణా, పోస్టల్ వంటి వివిధ శాఖల అధికారులతో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణపై కీలక సూచనలు జారీ చేశారు.జిల్లా వ్యాప్తంగా మొత్తం 41 కేంద్రాలలో పరీక్షలు నిర్వహించబడతాయనీ, ఈ నెల 21 నుండి పరీక్షలు ప్రారంభమవుతాయనీ తెలిపారు. ఉదయం సెషన్: 9.00 నుండి 12.00 గంటల వరకు మధ్యాహ్నం సెషన్: 2.00 నుండి 5.00 వరకు జరుగుతాయన్నారు.మొదటి సంవత్సర పరీక్షలకు 9274 మంది, ద్వితీయ సంవత్సర పరీక్షలకు 5558 మంది వోకేషనల్ 1125 మంది మొత్తం 15957 మంది హాజరవుతారని చెప్పారు. మొత్తం 41 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రాల్లో అనుమతించబడదని, అలాగే విద్యార్థులు ఎలాంటి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, పరీక్ష కేంద్రంలో అనుమతించారని తెలిపారు. పరీక్ష కేంద్రాలలో అవసరమైన లైట్లు,ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి ఒక్క పరీక్షా కేంద్రం వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్ష కేంద్రాల్లో ఏదైనా సమస్య వస్తే వెంటనే తెలియజేయుటకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని కంట్రోల్ రూమ్ నెంబర్ 9866112750 కు తెలియజేయవచ్చునని తెలిపారు.పరీక్షా కేంద్రాలవద్ద 163 సెక్షన్ విధించాలని, పరీక్షలు నిర్వహించే పరిసర ప్రాంతాలలో జిరాక్స్ షాపులను మూసివేయాలని చెప్పారు. విద్యార్థులు ఇబ్బంది పడకుండా త్రాగునీరు, మరుగుదొడ్లు లాంటి మౌలిక వసతులను కల్పించాలని, పరీక్షా కేంద్రాలకు హాజరయ్యేందుకు వీలుగా ఆర్టిసి బస్సులను నడపాలని చెప్పారు. పరీక్ష నిర్వహించే సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని, పారిశుధ్యం, త్రాగునీటి వసతులు, పరిశుద్ధ పనులను పంచాయితీశాఖ, మున్సిపాల్టీలు అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. కేంద్రాలవద్ద పటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలని చెప్పారు. పరీక్షా సమయంలో దూర ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులకు రవాణా సౌకర్యాలు కల్పించాలని ఆర్టీసీ అధికారులకు ఆదేశించారు. ప్రతీ పరీక్షా కేంద్రంవద్ద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని ఓ ఆర్ ఎస్ పాకెట్లు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని వైద్యాధికారులకు తెలిపారు. ప్రతీ కేంద్రంవద్దా సిట్టింగ్ స్క్వాడ్ తోపాటు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇంటర్ మీడియట్ పరీక్షలకు సంబంధించిన విద్య, పోలీస్, రవాణా, విద్యుత్తు, వైద్య, పోస్టల్, మున్సిపాలిటీ, పంచాయతీ రాజ్, లేబర్, పోస్టల్ తదితర శాఖలు పరీక్షలు అత్యంత పారదర్శకంగా, క్రమశిక్షణతో నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని డిఆర్ఓ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరీక్షల నిర్వహణ కమిటి మరియు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి రవి, డీఈవో సుబ్రహ్మణ్యం, సమగ్ర శిక్ష ఏపీసీ అనురాధ, మదనపల్లి మున్సిపల్ కమిషనర్ ప్రమీల, మున్సిపల్ శాఖ డివై ఈఈ పి శ్రావణి, సర్వ శిక్ష అభియాన్ అధికారిని డిపిఎమ్ఓ రమేష్ బాబు, ఆర్టీసీ డిఎం ఎం. వి. ఆర్. రెడ్డి, ఇన్స్పెక్టర్ రామాంజనేయులు, పోస్టల్ అధికారిని సునంద, విద్యుత్ శాఖ అధికారి తదితరులు పాల్గొన్నారు.



## అభయాంజనేయ స్వామి అనుగ్రహం పొందాలి కౌన్సిలర్ అంజి గౌడ్

**జయభేరి, దేవరకొండ :**

శ్రీ శ్రీ ఆభయాంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిలర్లు అంజి గౌడ్, పొట్ట మురళి, పొట్ట మధు దేవరకొండ మండలంలోని గన్యానాయక్ తండాలో నిర్వహించిన శ్రీ శ్రీ అభయాంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని, స్వామి వారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించిన దేవరకొండ కౌన్సిలర్లు ఆ స్వామి వారి ఆశీస్సులు ఎల్లప్పుడు దేవరకొండ నియోజకవర్గ ప్రాంత ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించినట్లు వారు తెలిపారు. అనంతరం గ్రామ నాయకులు మరియు ఆలయ కమిటీ శాలువాతో సత్కారించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోపాల్ నాయక్, రాష్ట్ర నాయకులు కిషన్ నాయక్, హరికిషన్, సంతోష్, గోపి తదితరులు పాల్గొన్నారు.

## అభయాంజనేయ స్వామి అనుగ్రహం పొందాలి


- ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి



**జయభేరి, దేవరకొండ :**

ప్రతి ఒక్కరు అభయాంజనేయ స్వామి అనుగ్రహం పొందాలి అని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. దేవరకొండ మండలం గన్యానాయక్ తండాలో శ్రీశ్రీశ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు రవీంద్ర కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి అని ఆయన అన్నారు. దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుంది అని అయన తెలిపారు.ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి అని అయన అన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ ని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్,బిఆర్ఎస్ మాజీ మండల పార్టీ అధ్యక్షులు TVN రెడ్డి, స్థానిక సర్పంచ్ నేనావత్ గోపాల్ నాయక్, రామావత్ తులిసీరామ్,బొడ్డుపల్లి కృష్ణ, నేనావత్ నగేష్,తదితరులు పాల్గొన్నారు.

## చందు నాయక్ ఆడబిడ్డ కానుకగా 1516 రూపాయల విరాళం



**జయభేరి, దేవరకొండ :**


దేవరకొండ మండలం కోర్ర తండ గ్రామపంచాయతీలో కోర్ర లింగ నాయక్ కూతురు అఖిల వివాహంలో పాల్గొని నూతన వధూవరుల ను ఆశీర్వదించిన జన సేన పార్టీ ఇంచార్జ్ బంజారా సినీ హీరో కోర్ర చందు నాయక్ చందు ఆడబిడ్డ కానుకగా 1516 రూపాయలు ప్రతి ఆడబిడ్డకు సర్పంచ్ గా గెలిస్తే 5016 ఓడితే 1516 ఇస్తాన మాట తప్పకుండా ప్రతి పేదింటి ఆడబిడ్డకు చందు కానుక ఇవ్వడం జరిగింది దేవరకొండ నియోజకవర్గంలో పేదల పక్షన అండంగా ఉంటు ప్రజలకు ఎల్లప్పుడూ తోడు ఉంటూ పేదలకు న్యాయ దిశగా పనిచేస్తుంది ప్రజల ఆశీర్వాదంతో దేవరకొండ ఖిల్లా పై జన సేన పార్టీ జెండా రెపరెపలాడబోతుంది అని జన సేన పార్టీ ఇంచార్జ్ కోర్ర చందు నాయక్ అన్నారు. ఈ కార్యక్రమంలో జన సేన పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## హెల్త్ అవేర్నెస్ కార్యక్రమం




**జయభేరి, దేవరకొండ :**

మునగాల కొండల్ రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) దేవరకొండలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక "విద్యా వారోత్సవాలలో" భాగంగా కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో "హెల్త్ అవేర్నెస్"కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ ఆర్.రాజేష్ (మెడికల్ ఆఫీసర్ పి.హెచ్ సి చందంపేట) హాజరై పరిశుభ్రత, కాలానుగున వ్యాధులపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా మానసిక ఒత్తిడి అనే అంశం పైన విస్తృతమైన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామావత్ రవి మాట్లాడుతూ డాక్టర్ ఆర్.రాజేష్ మానసిక ఒత్తిడి గురించి, నిద్రలేమి సమస్యల గురించి, ఆహారపు అలవాట్ల గురించి చాలా చక్కగా అవగాహన కల్పించాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.కోటయ్య, అకాడమిక్ కోఆర్డినేటర్ సి. లింగమయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ జి.లింగారెడ్డి, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ కె. పృథు ,ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ వి.మకట్లాల్, డాక్టర్ ఎం.ప్రభాకర్, డాక్టర్ కె. రేణుక తదితర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.




## డీజిల్ పెట్రోల్ వద్దు బ్యాటరీ సోలార్ ముద్దు

- గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీ హరి

**జయభేరి, వరంగల్ మే 14 ;**

వరంగల్ చౌరస్తాలో గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీ హరి ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు ముఖ్య ఉద్దేశం పెట్రోల్ డీజిల్ గ్యాస్ వాటి మీద భారతీయులు ఎప్పుడుఆధారపడవద్దని ఇతర దేశాల మీద ఆధారపడవద్దని ఏ దేశంలో యుద్ధం జరిగిన ఆ యొక్క ఎఫెక్ట్ భారతదేశ మీద కూడా పడుతుందని దాని ద్వారా సమర్లు విజిల్ పెట్రోల్ గ్యాస్ లాంటి ప్రజలకు టైముకుఅందకపోవడం వాటిపై అతిగా అధికమైన రేట్లు పెట్టడం ఇది వల్ల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు కనుక ప్రతి ఒక్కరు సైకిల్ వినియోగం పెంచాలి పెట్రోల్ డీజిల్ ని ఆదా చేయాలి పాత వ్యవస్థలో సైకిల్ విధానం అనేది చాలా గొప్పది దానివల్ల ఆరోగ్యమే కాకుండా ఆర్థిక భారం తగ్గుతుంది ఇటువంటి పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ బ్యాటరీ సోలార్ బండ్లను వినియోగించుకోవాలని అలాగాకముఖ్యమంత్రులు మంత్రులు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు మిగతా రాజకీయ నాయకులు వారి యొక్క సెక్యూరిటీ వాహనాలను తగ్గించుకోవాలని కోరారు వీరిని చూసి దేశ ప్రజలు స్ఫూర్తిగా తీసుకొని వారి బాటలు నడవాలని రాజనాల స్కోరి కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి మూలపాక ప్రసాద్ మాగంటి శివ గంగ్రకోట రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

## అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు బీభత్సం

- యువకుడికి గాయాలు

**జయభేరి, సికింద్రాబాద్ :**

సికింద్రాబాద్ రేతి ఫైల్ బస్ స్టాప్ వద్ద ఆర్టీసీ బస్సు బీభత్సం సృష్టించింది. ప్రయాణికులపైకి దూసుకెళ్లడంతో వారంతా పరుగులు తీసారు. దాంతో పెను ప్రమాదం తప్పింది. బస్సు ఢీ కొట్టడంతో యువకుడు గాయాల పాలైయాడు. తోటి ప్రయాణికులు 108 కి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది యువకుడికి ప్రాథమిక చికిత్స అందించి గాంధీ ఆసుపత్రికి తరలించారు.

# తమిళనాడులో పుష్ప సోఫాలు

- వైరల్ గా మారిన స్టాలిన్ కామెంట్స్

**జయభేరి, చెన్నై, మే 14 :**




తమిళనాడు రాజకీయాలు ఇప్పుడు వెండితెరను మించిన ఉత్కంఠను రేపుతున్నాయి. అసెంబ్లీలో బుధవారం జరిగిన బలపరీక్షలో ముఖ్యమంత్రి విజయ్ తన బలాన్ని నిరూపించుకున్నప్పటికీ, సభలో జరిగిన సోఫా చర్చ ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్, విజయ్ ప్రభుత్వ ఏర్పాటుపై విమర్శలు గుప్పిస్తూ.. అన్నాడీఎంకేలో చీలిక తెచ్చి, వారి మద్దతు కూడగట్టడానికి సోఫా రాయబారం నడిపారని ఆరోపించడం ఈ కొత్త వివాదానికి తెరలేపింది.ఉదయనిధి స్టాలిన్ అసెంబ్లీలో అన్నాడీఎంకేలో చీలిక వచ్చింది. ఆ పార్టీలోని ఒక వర్గం నేత ఇంటికి రాత్రికి రాత్రే ఒక సరికొత్త సోఫా డెలివరీ అయింది. ఆ తర్వాత స్వయంగా ముఖ్యమంత్రి అక్కడికి వెళ్లి చర్చలు జరిపారు. ఆ సోఫా వెనుక ఏముందో? ఏయే డీల్స్ కుదిరాయో? అంటూ చమత్కరిస్తూనే ఘాటు విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో అన్నాడీఎంకేను అవినీతి పార్టీ అన్న విజయ్, ఇప్పుడు అదే పార్టీ ఎమ్మెల్యేల మద్దతుతో ప్రభుత్వాన్ని ఎలా నడుపుతారని ఆయన ప్రశ్నించారు. ఉదయనిధి ఈ మోడల్‌కు సోఫా మోడల్ అని పేరు పెట్టి సోషల్ మీడియాలోనూ విమర్శలు చేస్తున్నారు. ఎందుకంటే పుష్ప సినిమాలో సోఫాలో డబ్బులు పంపి పంచాలుగా పంపిస్తూ ఉంటారు. విజయ్ సర్కార్ అనేది ఒక రీల్స్ గవర్నమెంట్ లా ఉండకూడదు, ప్రజల కోసం పనిచేసే రియల్ గవర్నమెంట్ లా ఉండాలి అని ఎద్దేవా చేశారు. కేవలం సినిమా గ్లామర్, సోషల్ మీడియా హంగామాతో ప్రభుత్వం నడవదని, క్షేత్ర స్థాయిలో సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అన్నాడీఎంకేకు చెందిన 47 మంది ఎమ్మెల్యేలలో దాదాపు 25 మంది విజయ్ ప్రభుత్వానికి మద్దతు తెలపడం. ఇది పళనిస్వామి నాయకత్వంలోని అన్నాడీఎంకేకు పెద్ద దెబ్బ కాగా, విజయ్‌కు వరంలా మారింది. డీఎంకే మాత్రం ఈ మార్పును అక్రమ పొత్తు గా అభివర్ణిస్తోంది. తమిళనాడు శాసనసభలో ఇకపై ఉదయనిధి స్టాలిన్, విజయ్ మధ్య జరిగే ఈ మాటల యుద్ధం, భవిష్యత్తులో రాజకీయ పరిణామాలను ఏ దిశగా తీసుకెళ్తుందో చూడాలి. ప్రస్తుతానికి మాత్రం సోషల్ మీడియాలో 'సోఫా' మీమ్స్ ట్రెండ్ అవుతున్నాయి.

## పారదర్శకమైన విచారణ జరిపించాలి


**జయభేరి, హైదరాబాద్, మే 14 :**

నీట్ యూజీ 2026 పరీక్ష రద్దు, పేపర్ లీక్ అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. దేశవ్యాప్తంగా సుమారు 22.79 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఈ అంశంపై కేంద్రం పారదర్శకమైన విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. పరీక్ష రద్దు నిర్ణయంతో లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, ఇలాంటి ఘటనలు పరీక్షల వ్యవస్థపై ఉన్న విశ్వసనీయతను దెబ్బతీస్తాయని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు.ముఖ్యంగా పేపర్ లీక్ మాఫియాపై ఉక్కుపాదం మోపాలని, విద్యార్థులు మళ్లీ ఇబ్బంది పడకుండా కేంద్ర ప్రభుత్వం తక్షణమే పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి సూచించారు. పోటీ పరీక్షలు అనేవి విద్యార్థుల ప్రతిభకు వేదిక కావాలి తప్ప, వారి జీవితాలను నాశనం చేసే సాధనాలుగా మారకూడదని ఆయన హితవు పలికారు. ఇదే సమయంలో ఆయన రాజకీయంగా కూడా విమర్శలు గుప్పించారు. పరీక్షల నిర్వహణలో వైఫల్యాలు, పేపర్ లీక్ ఘటనల విషయంలో గత ప్రభుత్వ తీరు, ఇప్పుడు కేంద్రంలోని బీజేపీ వైఖరి ఒకేలా ఉందంటూ రేవంత్ రెడ్డి చురకలు అంటించారు.ఈనెల 3వ తేదీన దేశంలోని 551 నగరాల్లో.. విదేశాల్లోని 14 నగరాల్లో సుమారు 22.79 లక్షల మంది విద్యార్థులు.. పరీక్షకు హాజరయ్యారని.. ఇప్పుడు పేపర్ లీకులు, పరీక్ష నిర్వహణలో జరిగిన అవకతవకల కారణంగా ఇప్పుడు మళ్లీ వారు తీవ్ర ఆందోళనలో పడినట్లు చెప్పారు. పేపర్ లీక్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి డిమాండ్ చేశారు. మరోసారి విద్యార్థులు ఇబ్బందులు పడకుండా కేంద్రం అన్ని రకాల చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.జాతీయ స్థాయి పరీక్షల విశ్వసనీయతను అన్ని విధాలుగా కాపాడాలని సూచించారు. ప్రశ్నపత్రాల లీకులు లేదా అవినీతికి పాల్పడిన ఏ వ్యక్తి అయినా నెట్‌వర్క్ అయినా.. వారి పలుకుబడి లేదా హోదాతో సంబంధం లేకుండా అత్యంత కఠినమైన శిక్షను ఎదుర్కోవాల్సిందేనని తేల్చి చెప్పారు. ఈ పేపర్ లీకేజీ ఘటనతో ప్రభావితం అయిన విద్యార్థులు, తల్లిదండ్రులకు తెలంగాణ ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.నీట్ రాసే విద్యార్థులు ఎన్నో త్యాగాలు, మానసిక ఒత్తిడి, ఆర్థిక భారాన్ని తట్టుకుని.. మరీ పరీక్షకు సిద్ధమవుతారని.. ఈ నేపథ్యంలోనే పోటీ పరీక్షలు విద్యార్థుల ఆందోళన, అనిశ్చితికి కాకుండా.. అవకాశాలు, ప్రతిభకు సాధనాలుగా మారాలని రేవంత్ రెడ్డి హితవు పలికారు. ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా ఉండేందుకు పటిష్టమైన రక్షణ చర్యలు, టెక్నికల్ సెక్యూరిటీ, జవాబుదారీతనం ఉండాలని డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# భర్తతో విడాకులు తీసుకున్న హీరోయిన్..



"కొన్ని మీడియా వర్గాలు మా వ్యక్తిగత జీవితాల పట్ల అవసరంలేని, అతిగా జోక్యం చేసుకునే వర్తనిని మేము తీవ్రంగా ఖండిస్తున్నాం. మేము విడిపోవాలని నిర్ణయించుకున్నామని తెలియజేస్తున్నాము. ప్రస్తుత పరిస్థితులను ప్రైవేట్‌గా, సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవడానికి మాకు కొంత సమయం అవసరమని భావిస్తున్నాము. కొన్ని కల్పిత కథలు, పచ్చి అబద్ధాలను ప్రచారం చేయడం ద్వారా మా వ్యక్తిగత జీవితాలను సంచలనం చేయడానికి ప్రయత్నాలు జరిగాయి. ఆ ప్రచారాలకు, మా మధ్య ఉన్న సంబంధం యదార్థానికి ఎటువంటి సంబంధం లేదు. మారుతున్న వ్యక్తిగత ప్రాధాన్యతలను దృష్టిలో ఉంచుకుని, పరస్పర గౌరవం, అవగాహనతో విడివిడిగా ముందుకు సాగాలని మేమిద్దరం కలిసి నిర్ణయం తీసుకున్నాము. ప్రస్తుతానికి, మేము ఈ దశను ఎంతో ఆలోచనాత్మకంగా, ప్రైవేట్‌గా దాటడంపై దృష్టి పెట్టాము. భవిష్యత్తులో కూడా మా మధ్య ఉన్న స్నేహాన్ని మేము ఎల్లప్పుడూ గౌరవిస్తాము. ఈ సమయంలో మా గోప్యతను గౌరవిస్తూ, మాకు మద్దతుగా నిలుస్తున్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు.. మౌనీ & సూరజ్" అంటూ రాసుకొచ్చారు. ప్రస్తుతం మౌనీ రాయ్, సూరజ్ పోస్టులు ఇప్పుడు నెట్టింట వైరలవుతున్నాయి. మౌని రాయ్, 2022 జనవరి 27న గోవాలో సూరజ్ నంబియార్‌ను వివాహం చేసుకున్నారు. ఈ వివాహ వేడుకలలో హల్దీ, సంగీత్ కార్యక్రమాలతో పాటు, సాంప్రదాయ మలయాళీ, బెంగాలీ వివాహ పద్ధతులు కూడా జరిగాయి. వివాహానంతర పూల్ పార్టీతో ఈ వేడుకలు ముగిశాయి. బెంగళూరుకు చెందిన వ్యాపారవేత్త, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్. అతడు దుబాయ్‌లో నివసిస్తున్నాడు.




## ఫస్టాఫ్ ప్రీక్వెల్ సెకండాఫ్ సీక్వెల్?

సూపర్‌స్టార్ రజనీకాంత్ ఇప్పటివరకూ 171 సినిమాల్లో నటించారు. అయితే ఫ్రాంచైజీ మాత్రం ఆయన చేయలేదు. నిజానికి బాషా, నరసింహ, చంద్రముఖి చిత్రాలకు సీక్వెల్ చేస్తే బావుంటుందనే ప్రపోజల్స్ ఆయనకు వచ్చాయి. కానీ వాటిని సున్నితంగా తిరస్కరించారు తలైవా. కానీ తొలిసారి 'జైలర్' సినిమాకు సీక్వెల్ చేస్తున్నారు. దానికి కారణం నెల్సన్ కుమార్ చెప్పిన కథేనని వినికిడి. 'జైలర్'లో ఆయన రిటైర్డ్ జైలర్ ముత్తువేల్ పాండియన్‌గా నటించిన విషయం తెలిసిందే. ఓ రిటైర్డ్ జైలర్ భయంకరమైన ఓ మాఫియా సామ్రాజ్యాన్ని ఎలా కుప్పకూల్చాడనేది 'జైలర్' కథ. అయితే.. 'జైలర్ 2' స్క్రిప్ట్ విషయంలో దర్శకుడు నెల్సన్ కుమార్ విభిన్నంగా ముందుకెళ్తున్నట్టు తెలుస్తున్నది. ఇందులో రిటైర్ కాకముందు, డ్యూటీలో ఉన్నటువంటి ముత్తువేల్ పాండియన్ జీవితాన్ని చూపిస్తాడట నెల్సన్. ప్రథమార్థమంతా ఆన్ డ్యూటీ జైలర్ కనిపిస్తాడట. అంటే ఓ విధంగా ప్రీక్వెల్ అన్నమాట. ఇక ద్వితీయార్థం మాత్రం 'జైలర్'కు సీక్వెల్‌గా సాగుతుందట. ఈ క్రమంలో రజనీకాంత్‌పై తీసిన కొన్ని సన్నివేశాలు గూజ్‌బంప్స్ తెప్పిస్తాయని ఇన్‌సైడ్ టాక్. సెప్టెంబర్ 4న సినిమా విడుదల కానున్నది. ఎస్‌జే సూర్య విలన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్, మిథున్ చక్రవర్తి, విజయ్ సేతుపతి ప్రత్యేక పాత్రల్లో కనిపిస్తారు. ఈ చిత్రానికి కెమెరా: విజయ్ కార్తీక్ కన్నన్, సంగీతం: అనిరుధ్ రవిచందర్, నిర్మాణం: సన్‌పిక్చర్స్.

## ఏడు రోజులు మాత్రమే..



ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'డ్రాగన్' (టైటిల్ ఇంకా ఖరారు కాలేదు) సినిమా అప్‌డేట్స్ కోసం ఎన్టీఆర్ అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుగుతున్నది. ఈ నెల 20న ఎన్టీఆర్ బర్త్‌డే సందర్భంగా స్పెషల్ సర్‌ప్రైజ్ ఉంటుందని వార్తలొచ్చాయి. తాజాగా ఈ విషయాన్ని చిత్రబృందం అధికారికంగా ధృవీకరించింది. ఈ మేరకు ఎక్స్ (ట్విట్టర్)లో ఓ ప్రకటన విడుదల చేసింది.Movies 'ఈ నెల 20న ఎన్టీఆర్‌నీల్ సినిమా ఫస్ట్‌గ్లింప్స్ విడుదల చేయబోతున్నాం. ఇంకా ఏడు రోజులు మాత్రమే' అంటూ నిర్మాణ సంస్థ పేర్కొన్నది. రుక్మిణి వసంత్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో అనిల్ కపూర్, టోవినోథామస్ తదితరులు ప్రధాన పాత్రల్లో పోషిస్తున్నారు. కల్యాణ్‌రామ్, నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, కొసరాజు హరికృష్ణ నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకురానుంది.



## శర్వానంద్ జోడీగా?

ఇటీవల విడుదలైన 'కపుల్ ఫ్రెండ్లీ' చిత్రంలో చక్కటి అభినయంతో మంచి గుర్తింపు తెచ్చుకుంది మాజీ మిస్ ఇండియా మానస వారణాసి. ఈ సినిమా విజయంతో ఈ భామకు తెలుగులో భారీ ఆఫర్లొస్తున్నట్టు వినికిడి. తాజా సమాచారం ప్రకారం శర్వానంద్‌తో కలిసి ఆమె ఓ చిత్రంలో నటించబోతున్నట్టు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. శర్వానంద్ కథానాయకుడిగా శ్రీను వైట్ల దర్శకత్వంలో 'జూర్ క్రిష్' పేరుతో ఓ రొమాంటిక్ కామెడీ చిత్రం తెరకెక్కుతున్నది. ఈ సినిమాలో కథానాయికగా మానస వారణాసిని కంఫర్మ్ చేసినట్టు తెలిసింది. ఈ సినిమాలోని కథానాయిక పాత్ర కోసం అనంతిక సనీల్‌కుమార్, రుక్మిణి వసంత్, మమితాబైజు పేర్లు మొన్నటి వరకూ వినిపించాయి. చిత్రబృందం చివరకు మానస వారణాసి వైపే మొగ్గుచూపుతున్నట్టు సమాచారం. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్నది.

# 'కెడి ది డెవిల్' మూవీ ట్రైలర్‌తో మాస్ హంగామా షురూ



'కెడి ది డెవిల్' ట్రైలర్ ఎట్టకేలకు రిలీజ్ అయింది. సినిమా మొత్తం థియేటర్‌ను షేక్ చేసేలా ఈ ట్రైలర్ అందరినీ ఆకట్టుకుంటోంది. విజిల్స్ వేయించే సీన్స్, అదిరిపోయే యాక్షన్, పవర్‌ఫుల్ డైలాగులు, కళ్లుచెదిరే విజువల్స్‌తో ట్రైలర్ ఇప్పటికే సోషల్ మీడియాలో దుమ్మురేపుతోంది. ఇప్పటికే కర్ణాటక అంతా గర్జించేలా హైప్ క్రియేట్ చేసిన 'కెడి: ది డెవిల్'.. ఈ ఏడాది విడుదలైన యాక్షన్ సినిమాల్లో అందరి దృష్టిని ఆకర్షించిన సినిమాల్లో ఒకటిగా నిలిచింది. సినిమా భారీ స్థాయి, ఇంటెన్స్ పెర్ఫార్మెన్స్‌లు, పక్కా మాస్ అప్పీల్ చూసి అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. దీంతో థియేటర్లలో పూర్తిస్థాయి మాస్ ఫీస్ట్ ఇవ్వబోతుందనే అంచనాలు పెరిగిపోయాయి. దుమ్మురేపే యాక్షన్ బ్లాక్స్, గ్రిప్పింగ్ వరల్డ్, గ్రాండ్ విజువల్స్‌తో ట్రైలర్ సిల్వర్ స్క్రీన్‌పై రాబోయే హంగామాకు పవర్‌ఫుల్ గ్లింప్స్ ఇచ్చింది. కె.వి.ఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ నారాయణ నిర్మాతగా రూపొందిన ఈ సినిమాకు అన్ని భాషల్లోనూ అమేజింగ్ రెస్పాన్స్ వస్తోంది. ఆడియెన్స్ అందరూ ఈ కంటెంట్‌ను ఉత్సాహంగా స్వాగతిస్తూ సినిమాపై భారీ ఆసక్తి చూపిస్తున్నారు. కన్నడలో వచ్చిన సూపర్ రెస్పాన్స్‌తో జోష్‌లో ఉన్న 'కెడి: ది డెవిల్' ఇప్పుడు మరింత భారీ స్థాయిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రేక్షకుల ముందుకు రానుంది. మే 15న గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమైన ఈ సినిమా, మాస్ మూవీని మరో లెవల్‌కు తీసుకెళ్లబోతోంది. దక్షిణ భారతదేశంలో భారీ అంచనాలు, పెరుగుతున్న హైప్‌తో రిలీజ్ అవుతోన్న కెడి: ది డెవిల్ మూవీ యాక్షన్, ఎమోషన్, స్టైల్, మాస్ సెలబ్రేషన్స్‌తో ఆడియెన్స్‌కు మరిచిపోలేని థియేట్రికల్ అనుభూతిని ఇవ్వబోతోంది. డెవిల్ వచ్చేశాడు... ఇక అసలైన మాస్ హంగామా ఇప్పుడే మొదలైంది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**